




# విజయభాను





విశాఖపట్నం, గురువారం 28-11-2019 VIJAYABHANU DAILY ⋆ VISAKHAPATNAM సంపుటి : 43 సంచిక : 69 పేజీలు : 8 వెల : 1 రూపాయి

# కాపు కాస్తున్నా




- కాపులకు ఏపీ సర్కార్ శుభవార్త
- కాపునేస్తం, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి పథకం
- కొత్త రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు, పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ
- సీఎం జగన్ నిర్ణయాలు.. కేబినెట్ ఆమోదం

అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో సీఎం జగన్ పలు కీలక నిర్ణయాలను మంత్రి మండలితో చర్చించారు. వైఎస్సార్ నవశకం పథకాలపై, కొత్త పెన్షన్ కార్డులు, పెన్షన్ అర్హతల మార్పులపై చర్చించారు. అదే విధంగా కొత్త రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు, జగనన్న విద్యా దీవెన కార్డుల జారీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. డిగ్రీ ఆపై ఉన్నత విద్యా కోర్సులు చదివే విద్యార్థులకు జగనన్న వసతి పథకం కింద రూ. 20 వేలు చెల్లింపు, వైఎస్సార్ జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు ప్రతిపాదనలపై, కొత్త బార్ పాలసీలకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది.

**ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు:**

- *వైఎస్సార్ కాపు నేస్తం పథకానికి రూ.1,101కోట్ల కేటాయింపు*
- *కాపు సామాజిక మహిళలకు ఏడాదికి రూ.15వేలు సాయం*
- *45 ఏళ్లు నిండిన ప్రతి కాపు మహిళకు ఐదేళ్లలో రూ.75వేలు సాయం*
- *2.5 లక్షల రూపాయల ఆదాయం ఉన్న కాపులకు వైఎస్సార్ కాపు నేస్తం వర్తింపు*
- *పది ఎకరాల మాగాణి, 25ఎకరాల లోపు మెట్ట ఉన్నవారికి వర్తింపు*
- *ట్రాక్టర్, ఆటో, ట్యాక్సీ నడుపుకునేవారికి మినహాయింపు*
- *టీటీడీ బోర్డు సభ్యుల సంఖ్య 19నుంచి 29కి పెంచుతూ నిర్ణయం*
- *పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని కేబినెట్ నిర్ణయం*

తరువాయి 2లో..

## శ్రీవారి భక్తులకు 10 రోజులపాటు వైకుంఠ ద్వార దర్శనం



వార్త 8వ పేజీలో..

## 2021 నాటికి వీఎంఆర్‌డిఏ బృహత్తర ప్రణాళిక

### రాష్ట్ర శాసన సభాపతి తమ్మినేని సీతారాం




శ్రీకాకుళం: విశాఖపట్నం మెట్రోపాలిటన్ ప్రాంతీయ అభివృద్ధి ప్రాధికార సంస్థ ప్రాంతంలో సమగ్రమైన అభివృధికి చర్యలు చేపట్టుటకు బృహత్తర ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర శాసన సభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. వియంఆర్డిఏ ఆధ్వర్యంలో వియంఆర్డిఏ ప్రాంతంలో దృక్పథ ప్రణాళిక - 2051 పై ప్రజా ప్రతినిధులతో కలెక్టర్ కార్యాలయంలో బుధ వారం సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో సభాపతి పాల్గొని మాట్లాడుతూ అభివృద్ధికి అవకాశం ఉన్న ప్రతి అంశాన్ని ప్రణాళికలో పొందుపరచాలన్నారు. ప్రణాళిక సమగ్రంగా, సమీకృతంగా ఉండాలని 2051 సంవత్సరం నాటి జనాభాకు అనుగుణంగా ఉండాలని అన్నారు. రాష్ట్రంలో 974 కి.మీ మేర కోస్తా తీరం ఉందని, బ్రహ్మాండమైన కోస్టల్ కారిడర్ నిర్మించుటకు అనేక అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. రవాణా రంగం కోసం సరిహద్దు రాష్ట్రాలకు అనుసంధానం చేసే అవకాశాలు పరిశీలించాలని అన్నారు. తద్వారా మార్కెటింగ్, వాణిజ్య, వ్యాపార రంగాలు అభివృద్ధికి అవకాశం ఉంటుందని చెప్పారు. విన్ విన్ పరిస్థితి నెలకొనాలని సభాపతి అన్నారు. సమీకృత ప్రణాళికలు ఉండాలని అన్నారు. జిల్లాలో గిరిజన

తరువాయి 6లో..

## నింగిలోకి దూసుకెళ్లిన పీఎస్ఎల్‌వీ- సీ 47 రాకెట్



నెల్లూరు: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఖాతాలో మరో విజయం వచ్చి చేరింది. భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి నింగిలోకి పీఎస్ఎల్‌వీ- సీ 47 వాహక నౌక దూసుకెళ్లింది. 14 ఉపగ్రహాలను పీఎస్ఎల్‌వీ- సీ 47 వాహకనౌక మోసుకెళ్లింది. ఈ వాహననౌక భూమిని వీడిన అరగంటలోపే కార్టోశాట్-3తో పాటు అమెరికాకు చెందిన మరో 13 ఉపగ్రహాలను పీఎస్ఎల్‌వీ- సీ 47 వాహకనౌక నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశించింది. అంటార్కిటి కాలోని ఇస్రో కేంద్రం పీఎస్ఎల్‌వీ సంకేతాలను అందుకోనుంది.

కార్టోశాట్-3 ఉపగ్రహం భూవాతావరణం, విపత్తులను హెచ్చరించనుంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రణాళికలు, రహదారుల నెట్‌వర్క్ పరిశీలన, నీటి సరఫరాపై అధ్యయనానికి ఇది ఉపయోగపడనుంది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ఇస్రో కార్టోశాట్-3ని రూపొందించింది. 1,625 కిలో బరువున్న కార్టోశాట్-3 జీవితకాలం ఐదేళ్ల పాటు సేవలందించనుంది. ఉపగ్రహం తయారీ కి ఇస్రో రూ.350 కోట్లు ఖర్చు చేసింది. ఈ సందర్భంగా ఇస్రో చైర్మన్ శివన్ మాట్లాడుతూ.. ప్రయోగంలో భాగస్వామ్యులైన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. వచ్చే మార్చి లోగా మరో 6 రాకెట్లతో 13 మిషన్లు ప్రయోగించ నున్నట్లు తెలిపారు. ఈ

తరువాయి 6లో..

## అమరావతికి 496 కోట్లు

### రాజ్యసభలో వి.విజయసాయి రెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబు

న్యూఢిల్లీ: స్మార్ట్ సిటీస్ మిషన్ కింద రాజధాని అమరావతికి ఇప్పటి వరకు 496 కోట్ల రూపాయలు విడుదల చేసినట్లు కేంద్ర పట్టణ వ్యవహారాల సహాయ మంత్రి హర్దీప్ సింగ్ పూరి రాజ్యసభలో వెల్లడించారు. వైఎస్సార్సీపీ సభ్యులు వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా జవాబిస్తూ ఈ విషయం తెలిపారు. స్మార్ట్ సిటీస్ మిషన్ కింద ఎంపికైన రాజధాని అమరావతి కోసం 2017-18 నుంచి ఇప్పటి వరకు కేంద్రం 496 కోట్ల రూపాయలు విడుదల చేయగా ఆ మొత్తంలో 472 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో స్మార్ట్ సిటీస్ మిషన్ కింద ఎంపికైన విశాఖపట్నం, తిరుపతి, కాకినాడ నగరాలకు విడుదల చేసిన నిధుల గురించి ఆయన వివరించారు. 2015-16 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటి వరకు విశాఖపట్నం నగరానికి 299 కోట్లు, తిరుపతికి 196 కోట్లు, కాకినాడకు 392 కోట్ల రూపాయలు కేంద్రం నుంచి విడుదలైనట్లు మంత్రి తెలిపారు.

తరువాయి 2లో..

## ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలి

### గవర్నర్‌ను కలిసిన ఉద్ధవ్ ఠాక్రే దంపతులు



ముంబై: శివసేన అధినేత, కాబోయే ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే, ఆయన భార్య రష్మీ బుధవారం గవర్నర్ భగత్‌సింగ్ కోశ్యారీని కలిశారు. ఒకవైపు అసెంబ్లీలో నూతన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుండగా మరోవైపు ఉద్ధవ్ రాజ్‌భవన్ వెళ్లి.. మర్యాద పూర్వకంగా గవర్నర్‌ను కలిశారు. గురువారం ముంబైలోని శివాజీ పార్కులో అట్టహాసంగా జరగనున్న కార్యక్రమంలో మహా వికాస్ అఘాది (శివసేన, ఎన్సీపీ, కాంగ్రెస్ కూటమి) తరపున ముఖ్యమంత్రిగా ఉద్ధవ్ ఠాక్రే పదవీ స్వీకార ప్రమాణం

తరువాయి 2లో..

## ఫిబ్రవరి నాటికి ఇళ్ల స్థలాలు సిద్ధం కావాలి

### జిల్లా కలెక్టర్ వి.వినయ్ చంద్



విశాఖపట్నం: ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమమైన పేదలందరికీ ఇల్లు కార్యక్రమానికి ఫిబ్రవరి నాటికల్లా అవసరమైన ఇళ్ల స్థలాలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ వి.వినయ్ చంద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ నగరం, పురపాలిక పట్టణాలలో, గ్రామీణ ప్రాంతాలలో లబ్ధిదారులకు ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి స్థల సేకరణ వేగవంతం చేయాలన్నారు. పేదలందరికీ ఇల్లు కార్యక్రమానికి ముఖ్యమంత్రి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నందున ఎటువంటి లోటు, అవాంతరాలు లేకుండా భూసేకరణ పక్కాగా చేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతంలో గ్రామ పంచాయతీల వారీగా భూమిని గుర్తించాలన్నారు. ఇదే క్రమంలో లబ్ధిదారుల జాబితాలను సిద్ధం చేస్తూ, అర్హులైన లబ్ధిదారుల గుర్తింపు వేగవంతం చేయాలన్నారు. ఈ ప్రక్రియను నగర ప్రాంతంలో జీవీఎంసీ, జిల్లాలో గృహ నిర్మాణ సంస్థ చేపట్టాలన్నారు. ముందుగా ప్రభుత్వ భూమి ఎంత అందుబాటులో ఉన్నది, పూలింగ్ ద్వారా అవసరమైన భూమిని గుర్తించాలన్నారు. ప్రస్తుతం వివిధ పథకాల ద్వారా జరుగుతున్న గృహ నిర్మాణాలలో మంజూరు చేసిన గృహాలలో శత శాతం ఇళ్ల నిర్మాణాలను డిసెంబర్ నాటికల్లా ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గృహాలు మంజూరు చేయబడిన లబ్ధిదారుల జాబితాలను ఆయా వార్డులు, గ్రామ సచివాలయ లలో వెంటనే ప్రదర్శిస్తూ ఉండాలన్నారు. దీని మూలంగా ఎంపిక పారదర్శకంగా ఉంటుందన్నారు. ఎంపిక కాని అర్హులైన లబ్ధిదారులు మరలా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ల్యాండ్ పూలింగ్ లో నగర ప్రాంతంలో భూములు ఇచ్చిన వారికి వి ఎం ఆర్ డి ఏ పరిధిలో గాని లేక దగ్గరలో గాని వారికి ఇవ్వవలసిన స్థలాలు కేటాయించాలని చెప్పారు. ల్యాండ్ పూలింగ్ విధివిధానాలను, దాని వలన మన

తరువాయి 2లో..



# సీఎం సహాయనిధి నుండి ఎల్‌ఓసిలు అందజేత



సీతమ్మధార : విశాఖ ఉత్తర నియోజకవర్గం 13వార్డులో అనారోగ్యంతో బాధపడుతున్న మండల శ్రీనివాసరావు కు 1,75,000/- మరియు 33వార్డులో అనారోగ్యంతో బాధపడుతున్న డి.అప్పారావుకు 71,000/- 35 వార్డులో అనారోగ్యంతో బాధపడుతున్న ముంజేటి శ్రీనివాస రావుకు 80,000/- 40వార్డులో అనారోగ్యంతో బాధపడుతున్న నాగల రాజుకు 35,000/- సి.యం సహాయనిధి నుండి ఎల్.ఓ.సి.లు అందజేసిన విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు.

ఈ కార్యక్రమంలో బానాల శ్రీను, గుజ్జు వెంకటరెడ్డి, దుప్పలపూడి శ్రీనివాసరావు, కట్టుమూరి సతీష్, పైడి శ్రీను, యన్.భాస్కరావు, బి.రామలక్ష్మి, యం.డి.గౌష్ తదితరులు పాల్గొన్నారు.

## అప్పన్నను దర్శించుకున్న ఏపీ పోలీస్ అకాడమీ అడీషనల్ డీజీపీ శ్రీధర్



సింహాచలం: సింహాద్రిపై కొలువు తీరివున్న వరాహ లక్ష్మీనారసింహ స్వామివారిని ఏపీ పోలీస్ అకాడమీ అడ్డీషనల్ డీజీపీ శ్రీధర్ ఐ పీ ఎస్ బుధవారం దర్శించుకున్నారు సింహగిరి కి చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు సంప్రదాయ బద్ధంగాఘనస్వాగతం పలకగా తొలుత కప్పస్థంభం ఆలింగనం చేసుకోగా అంతరాలయంలోస్వామివారికి తమగోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేయించారు. దర్శనాంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. అలయ అధికారులు స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదలు అందజేశారు.

## సత్యదేవుని హుండీల లెక్కింపు ఆదాయం 13 రోజులకు రూ.1.26 కోట్లు

*- హుండీల లెక్కింపును పర్యవేక్షించిన ఈవో వి.త్రినాధరావు*



అన్నవరం.......తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం తాలూకా హుండీల లెక్కింపు బుధవారం నిర్వహించారు.గడచిన 13 రోజులకు గాను సత్యదేవుని హుండీల ఆదాయం రూ.1,26,55,655/-(ఒక కోటి,ఇరవై ఆరు లక్షల,యాభై ఐదు వేల,ఆరు వందల యాభై ఐదు రూపాయలు)రాగా బంగారం 32 గ్రాములు,వెండి 730 గ్రాములు, యుయస్ఏ కరెన్సీ 104 డాలర్లు,ఆస్ట్రేలియా 55 డాలర్లు,సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఓమెన్ 1700 బేస్ మరియు ఇతర విదేశీ ద్రవ్యముతో పాటు రద్దయిన పాత కరెన్సీ రూ.45,000 /- లభ్యమయ్యాయి.

ఈ హుండీల లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం ఈవో వి.త్రినాధరావు,ఏసి రమేష్ బాబు, ఎండోమెంట్స్ ఇన్ స్పెక్టర్ వి.యల్,యల్.నరసింహరెడ్డి,గ్రేడ్ 3 ఈవో యమ్.యమ్.వీరభద్రరావు,

ఏఈవో ప్రసాద్, పిఆర్వో కొండలరావు మరియు దేవస్థానం అధికారులు, సిబ్బంది,వ్రత పురోహి తులు, అర్చకులు, నాయీ బ్రాహ్మణులు,శ్రీహరి సేవా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 'మణి భూషణ్ దివ్య క్షేత్రం' చిత్రం పోస్టర్ ఆవిష్కరణ



విశాఖపట్నం : నగరానికి చెందిన ... ప్రముఖ పర్యాటక స్వచ్ఛంద సంస్థ డిజిటల్ వీడియోస్ మరియు విశాఖ ట్రావెల్ అండ్ టూరిజం వారి ప్రతిష్టాత్మక టీవీ టూరిజం ఛానల్ నిర్మాణంలో ... సంస్థ అధినేత మరియు ప్రముఖ దర్శకుడు అయినటు వంటి మణి భూషణ్ చేతుల మీదుగా మహా పుణ్యక్షేత్రమైన ... చార్ ధామ్ లో ఒకటైన... పూరి శ్రీ శ్రీ శ్రీ జగన్నాథ స్వామి వారి దేవాలయం, ఒరిస్సాలో...

ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రపంచ పర్యాటక దినోత్సవం 2019 వేడుకల్లో భాగంగా .... ఏటా ఇచ్చే ప్రతిభా పురస్కారాలు లో భాగంగా... ఉత్తమ పర్యాటక చిత్రం విభాగానికి గాను

దివ్యక్షేత్రం చిత్రానికి ఉత్తమ అవార్డు ను డైరెక్టర్ =.మణి భూషణ్ కుమార్ గారు అందుకున్నారు.

ఈ చిత్రం త్వరలో విడుదలకు సిద్దం అవుతుందని. ఈ సందర్భంగా ఒరిస్సాలోని మహ పుణ్యక్షేత్రమైన పూరిజగన్నాథ సన్నిధిలో... స్థానిక ప్రముఖులతో ఈ

దివ్యక్షేత్రం చిత్రం పోస్టర్ ఆవిష్కరణ అత్యంత రమణీయంగా జరిగిందని తెలిపారు.

ఈ సందర్భంగా దర్శకుడు రచయిత మణి భూషణ్ గారు మాట్లాడుతూ ... దివ్య క్షేత్రం చిత్రం ద్వారా విజయనగరం లో వెలిసిన శ్రీశ్రీశ్రీ మన్నార్ రాజా వేణుగోపాల స్వామి వారి పురాతన వెయ్యి సంవత్సరాలకు పూర్వం నిర్మితమైన ఈ దేవాలయం అద్భుత శిల్ప సంపద కలిగిన మహిమాన్విత పుణ్యక్షేత్రము గా పర్యాటకులకు కళ్లకు కట్టినట్టుగా చూపించడం ద్వారా టెంపుల్ టూరిజం అభివృద్ధికి కృషి చూస్తున్నామని...


మా సంస్థ ఇంతకు ముందు విడుదల చేసిన దేవాలయ దర్శనం చిత్రం ద్వారా ఉత్తరాంధ్ర దేవాలయాలును ప్రపంచ పర్యాటకులకు పరిచయం చేశామని ... దేవాలయ దర్శనం... సర్వ పాప నాశనం... ప్రతి ఒక్కరూ మానవత్వపు విలువల కోసం దేవాలయాలు దర్శించాలని ... ఆ జగన్నాథుని ఆశీస్సులతో ఈ చిత్రం విడుదలకు ముందే ఘన విజయం సాధించిందని త్వరలో టీవీ టూరిజం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా విడుదల అవుతుందని ఈ చిత్రం పోస్టర్ ఒరిస్సా పూరిలో జగన్నాథుని సమక్షంలో విడుదల చేయడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు...

ఈ సంస్థ ప్రతినిధులు సీఈవో సీతారామ స్వామి, ఎడిటర్ నీరజ, నిర్మాత గుణదిత్య, ఇతర సభ్యులు హాజరై ... దర్శకుడు మణి భూషణ్‌కి శుభాకాంక్షలు తెలియజేశారు... మరిన్ని వివరాలకోసం 24 గంటల ఉచిత పర్యాటక సమాచారానికి ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ నెంబర్ 9848418582 ద్వారా పొందవచ్చు అని తెలిపారు.

ఆగ్ర కులాల ఆధిపత్యాన్ని ఎదిరించిన

# మహాత్మా జ్యోతిరావు ఫూలే

*నవంబర్ 28 పూలే వర్ధంతి సందర్భంగా..*



జ్యోతిరావు ఫూలే గా పిలువబడే జ్యోతిబా గోవిందరావు పూలే మహారాష్ట్రలో 1827 ఏప్రిల్ 11న జన్మించారు. 1841లో పూణే లోని మిషన్ పాఠశాలలో చేరారు. 1848లో భారతదేశ సాంఘిక సంస్కరణల స్వరూపాన్ని మార్చిన సంఘటన జరిగింది. పూలే అగ్రవర్ణ పెద్దలు తక్కువ కులం వాడివి మాతో కలిసి నడుస్తావా అంటూ తిట్టి అవమానించారు. వీరిలో ఆనాడు కొత్త ఆలోచనలు అంకురించాయి. థామస్ పయినే రచించిన రైట్స్ ఆఫ్ మెన్ అనే గ్రంథం వీరిపై ఎంతగానో ప్రభావం చూపింది. స్త్రీలు, క్రింది కులాల వారు చదువుకునే విజ్ఞాన వంతులైతేనే సామాజిక దూరాచారాలు పోతాయని నమ్మారు. మొదట 1848లోనూ, తరువాత 1851లోనూ బాలికల పాఠశాలలు ఏర్పాటు చేశారు. దిక్కులేని పిల్లలు, వితంతువుల కోసం అనాథ శరణాలయం ప్రారంభించారు. 1873లో సత్యశోధక్ సమాజ్ స్థాపించి, అగ్రకులాల ఆధిపత్యాన్ని ఎదిరించమని బాధితులైన నిమ్న కులాల వారికి ప్రభోదించారు. తన భార్య సావిత్రి పూలే తో కలసి స్త్రీ విద్యకు విశేషకృషి చేశారు. 1888 మే 11న వేలాదిమంది సమక్షంలో మహాత్మా బిరుదు ప్రజలు వీరికిచ్చారు. తృతీయ రత్న నాటిక, జాతి భేదా వికారస్, ఛత్రపతి శివాజీ రాజే భోసలే, యాంచా పవాడా, బ్రహ్మ(1869), గులాంగిరి (1872), శేతకార్యాచ ఆఫుడ్ 1883 మొదలగునవి వీరి విశిష్ట రచనలు. వెనుకబడిన కులాల అభివృద్ధి కోసం జీవితానర్పించిన మహాత్మా జ్యోతిరావ్ పూలే 1890 నవంబర్ 28 న కన్నుమూశారు. 1887 జులై లో రాసిన తన వీలునామా లో బ్రాహ్మణులు కానీ బ్రాహ్మణ అనుయాయులు కానీ తన మృతదేహాన్ని తాకరాదని, వాళ్ళ నీడకూడా తనపై వాలకూడదని నిష్కర్షగా పేర్కొన్నారు. అంబేద్కర్ సగౌరవంగా పూలేను తన గురువుగా పేర్కొన్నారు.

## బంగ్లాదేశ్ జైల్లో ఉన్న మత్స్యకార బాధిత కుటుంబాలకు బియ్యం పంపిణీ



పూర్ణ మార్కెట్ : బంగ్లాదేశ్ కోస్ట్ గార్డ్ అరెస్టు చేసిన మత్స్యకార కుటుంబాలకు ఆంధ్రప్రదేశ్ మత్స్యకార యువజన సమాఖ్య ఆధ్వర్యంలో పిషింగ్ హార్బర్ దగ్గర జాలారి పేట లో కార్యక్రమం ఏర్పాటు చేసి జైల్లో ఉన్న మత్స్యకారులను త్వరలోనే విడుదల చేయడానికి ప్రయత్నిస్తున్నామని తెలుపుతూ, ఒక్కొక్కరికి 25 కేజీల బియ్యము ను ఎనిమిది బాధిత కుటుంబాలకు అందజేయడం జరిగినది. యువజన సమాఖ్య అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు మూగి శ్రీనివాస రావు, మైలపల్లి శ్రీనివాస రావు, నర్సింగరావు, ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

## ఫిజియోథెరిపీతో వైకల్యం నయం

### ఎంఇఒ డి.వి.డి.ప్రసాద్

యస్.రాయవరం : వైకల్యం ఉన్న పిల్లలకు ఫిజియోథెరిపీ చేయడం వల్ల సమస్య నుంచి త్వరతగతిన బయడపడతారని ఎంఇఒ డివిడి ప్రసాద్ అన్నారు. సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఫిజియోథెరిపీపై అవగాహన కల్పించారు. ముందుగా ఎంఇఒ మాట్లాడుతూ ప్రతి వారం స్థానిక భవిత కేంద్రంలో ఉచితంగా వికలాంగు పిల్లలకు ఫిజియోథెరిఫీ సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫిజియోథెరిపీ డాక్టర్ లక్ష్మి మానస మాట్లాడుతూ వైకల్యం వున్న పిల్లల్లో సమస్యను గుర్తించిన వెంటనే ఫిజియోథెరిపీ చేయడం వల్ల సమస్య నుంచి బయటపడ తారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బూత్ స్థాయి నుంచి

## పార్టీని బలోపేతం చేయాలి

### టీడీపీ మండలాధ్యక్షులు కాశీనాయుడు

కోటవురట్ల : బూత్ స్థాయి నుంచి తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసేందుకు గ్రామ కమిటీలు కృషి చేయాలని టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు లాలం కాశీనాయుడు అన్నారు. మంగళవారం రాత్రి యండపల్లి, అన్నవరం, తంగేడులో పర్యటించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు, నేతలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో యండపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా యనమల రాజబాబు, అన్నవరం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా శెట్టి విశ్వనాథం, తంగేడు గ్రామ కమిటీ అధ్యక్షుడిగా సింగంపల్లి శ్రీనును నియమంచినట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో యండపల్లి మాజీ సర్పంచ్ హైమావతి, చంటి తదితరులు ఉన్నారు.

## డిసెంబరు 2 నుంచి సామాజిక తనిఖీలు

కోటవురట్ల : సామాజిక తనిఖీ కోసం రికార్డులు సిద్దం చేశామని ఏపిఒ నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. వచ్చే నెల 2 నుంచి 12వ విడత సామాజిక తనిఖీ మండలంలో ప్రారంభం అవుతుందన్నారు. ఇందుకోసం సిబ్బంది రికార్డులతో సిద్ధంగా ఉన్నారన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలోను తనిఖీ, రికార్డుల పరిశీలన కోసం ఏర్పాట్లు చేశామని తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

## కాపు కాస్తున్నా

**ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు:**

ఉగాది నాటికి 25లక్షల ఇళ్ల పట్టాలు పంపిణీ
ఇళ్ల పట్టాలపై పేదలకు హక్కు కల్పిస్తూ రిజిస్ట్రేషన్‌కు నిర్ణయం
జగనన్న వసతి పథకానికి కేబినెట్ ఆమోదం
రెండు విడతలుగా జగనన్న వసతి దీవెన
రూ.2,300 కేటాయింపు
ఐటీఐ విద్యార్థులకు రూ.10వేలు
పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15వేలు
డిగ్రీ, ఉన్నత విద్యార్థులకు ఏడాదికి రూ.20వేలు ఆర్థిక సాయం
కడప స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనకు కేబినెట్ ఆమోదం.
3.295 ఎకరాల భూమి సేకరించాలని నిర్ణయం.
ఇనుప ఖనిజం సరఫరాపై ఎన్ఎండీసీతో ఒప్పందం
ఆంధ్రప్రదేశ్ పవర్ కార్పొరేషన్ బ్యాంకు నుంచి రుణాలు
మద్యం ధరలు పెంచుతూ తీసుకున్న నిర్ణయాలపై ఆమోదం
ఫీజు రియింబర్స్‌మెంట్ కోసం రూ.3,400 కోట్లు కేటాయింపు
రూ.225లక్షలలోపు వార్షిక ఆదాయం ఉన్నవారికి విద్యాదీవెన వర్తింపు
సీపీఎస్ రద్దుపై ఏర్పాటైన వర్కింగ్ కమిటీకి ఆమోదం
గిరిజన ప్రాంతాల్లో ఆశావర్కర్ల జీతం రూ. 400 నుంచి రూ.4వేలకు పెంపు.

## నింగిలోకి దూసుకెళ్లిన పీఎస్ఎల్‌వీ- సీ 47 రాకెట్

విజయం భవిష్యత్ ప్రయోగాలకు మరింత స్ఫూర్తినిస్తుందని ఇస్రో చైర్మన్ డా. శివన్ అన్నారు.

ఇస్రోకు ప్రధాని అభినందనలు

దేశీయంగా నిర్మించినటువంటి కార్టోశాట్-3 ఉపగ్రహాన్ని, ఆ ఉపగ్రహంతో పాటే యుఎస్ఎకు చెందిన 12కు పైగా బుల్లి ఉపగ్రహాలను మోసుకొంటూ పోయిన పిఎస్ఎల్వి-సి47ను విజయవంతంగా ప్రయోగించినందుకు యావత్తు ఇస్రో జట్టును ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అభినందించారు.

ఇస్రోకు మరిన్ని విజయాలు దక్కాలి

పీఎస్ఎల్వీ సీ-47 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించినందుకు ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. ప్రయోగ పర్వంలో ఇస్రో శాస్త్రవేత్తలు చేసిన కృషిని చూసి దేశం మొత్తం గర్విస్తోందన్నారు. రాబోయే రోజుల్లో ఇస్రో బృందానికి ఇలాంటి మరెన్నో అద్భుతమైన విజయాలు దక్కాలని ఆయన మనసారా ఆకాంక్షించారు.

## ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలి

చేయనున్నారు. శివసేన, ఎన్సీపీ, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మంగళవారం సాయంత్రం భేటీ అయి.. ఉద్ధవ్ ఠాక్రేను తమ కూటమి నేతగా ఎన్నుకున్న సంగతి తెలిసిందే. అనంతరం మూడు పార్టీల నేతలు బృందంగా వెళ్లి గవర్నర్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా కోరారు. తమ కూటమికి 166మంది ఎమ్మెల్యేల మద్దతు ఉన్నట్టు తెలిపారు. ఇందుకుప్రతిగా ఉద్ధవ్‌కు లేఖ రాస్తూ.. డిసెంబర్ 3లోగా అసెంబ్లీలో మెజారిటీ ఎమ్మెల్యేల మద్దతు ఉన్నట్టు లేఖ ఇవ్వాల్సిందిగా సూచించారు. మరోవైపు శివసేన సీనియర్ నేత సంజయ్ రౌత్ మీడియాతో మాట్లాడుతూ.. మహారాష్ట్రలో కొత్త మార్పు రాబోతోంది. మిషన్ కంప్లీట్ అయింది. ఉద్ధవ్ ఠాక్రే సీఎం కాబోతున్నారు అని పేర్కొన్నారు.

## అమరావతికి 496 కోట్లు

స్మార్ట్ సిటీస్ మిషన్ కింద దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన 100 నగరాల అభివృద్ధి కోసం మొత్తం 23,054 కోట్ల రూపాయల నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయగా ఇప్పటి వరకు 18,614 కోట్ల రూపాయలను వివిధ నగరాలకు విడుదల చేసినట్లు చెప్పారు. స్మార్ట్ సిటీస్ మిషన్‌ను వేగవంతంగా అమలు చేయడంలో ఎదురవుతున్న ఆటంకాల గురించి అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ ఈ మిషన్‌ను హడావిడిగా అమలు చేయడం తమ లక్ష్యం కాదని అన్నారు. మిషన్ కింద అమలు చేసే వివిధ ప్రాజెక్టులు నాణ్యతాపరంగా అత్యత్తమంగా ఉండాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. స్మార్ట్ సిటీస్ ఎంపిక తర్వాత స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటు, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీల ఎంపిక, మానవ వనరుల సమీకరణ, డీటెల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్‌ల రూపకల్పన అనంతరమే ఆయా ప్రాజెక్ట్‌లకు సంబంధించిన పనులకు టెండర్లు పిలవడం జరుగుతుందని, ఈ ప్రక్రియలు పూర్తి కావడానికి తగినంత కాల వ్యవధి అవసరముందని చెప్పారు. గడచిన ఏడాదిగా మిషన్ అమలును వేగిరపరచగలిగామని అన్నారు. కేటాయించిన నిధులను ఆయా నగరాలు వినియోగించే వేగం కూడా 9 రెట్లు పెరిగిందని అన్నారు. మార్చి 2018 నాటికి కేవలం 1000 కోట్లు వినియోగిస్తే నవంబర్ 15, 2019 నాటికి అది 9497 కోట్ల రూపాయలకు పెరిగిందని మంత్రి వివరించారు.

## ఫిబ్రవరి నాటికి ఇళ్ల స్థలాలు సిద్ధం కావాలి

రైతులకు కలిగే ప్రయోజనాలను తెలియజేసి వారికి పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటి వరకు గుర్తించిన స్థలాల విస్తీర్ణం, అవసరమైన భూముల విస్తీర్ణం, అందుబాటులో ఉన్న భూముల వివరాలు, ల్యాండ్ పూలింగ్ కు గుర్తించిన, గుర్తించవలసిన భూములను గూర్చి క్షుణ్ణంగా సమీక్షించారు. పేదలందరికీ ఇల్లు కార్యక్రమంలో చేపడుతున్న కార్యాచరణ ప్రణాళిక, రోజువారి నివేదికలను అందజేయాలని ఆదేశించారు. క్షేత్ర పరిశీలనకు వెళ్లి గృహ నిర్మాణానికి అనుగుణంగా ఉన్న స్థలాలను ఎంపిక చేయాలన్నారు. ఎంపిక చేసిన స్థలాలను అభివృద్ధి చేసే బాధ్యతను డ్వామా అధికారులు చేపట్టాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఎల్. శివ శంకర్ పాడేరు సబ్ కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్, డి ఆర్ వో ఎం. శ్రీదేవి, ఆర్డీవోలు పెంచల కిషోర్, గోవిందరావు, సీతారామారావు, హౌసింగ్ జిఎం జయ రామాచారి, యుసిడి పి డి శ్రీనివాస్, ఎమ్ ఆర్ డి ఎ సెక్రెటరీ శ్రీనివాస్, సిటీ ప్లానర్ విద్యుల్లత, ఎస్ డి సి రంగయ్య, టిట్కో ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఇ.బోనంగి గ్రామ కమిటీ ఎన్నిక



పరవాడ: పరవాడ మండలము ఈ బోనంగి గ్రామ తెలుగుదేశం గ్రామ కమిటీ ఎన్నికలు బుధవారము జరిగాయి. ఈ ఎన్నికల్లో గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శి లుగా బొద్దపు రామకృష్ణ ,బుగిడి రమణారావు , తెలుగు యువత అధ్యక్ష ,కార్యదర్శి లుగా కోమటి కరుణ్ కుమార్ ,సియాద్రి గోవింద, తెలుగు మహిళా చందక వరలక్ష్మి, మేడిశెట్టి ఉమను, తెలుగు రైతు దాము రోతి నరసింగరావు బొద్దపు అప్పారావు (చింతాలు) లును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మాసవరపు అప్పలనాయుడు, తాజా మాజీ సర్పంచ్ బొద్దపు నూకరత్నం, బుగిడి గోవిందరావు, అట్టా సన్యాశి అప్పారావు, గిరి, రమణ తథితర్లు పోల్గోన్నారు.

# ఠాక్రే కుటుంబం నుంచి తొలి సీఎం

### ఒక్క ఎన్నికలోనూ పోటీచేయని ఉద్ధవ్

ముంబై: శివసేనాధిపతి బాల్ ఠాక్రే కుటుంబం నుంచి ముఖ్యమంత్రి అవుతున్న తొలి వ్యక్తిగా ఆ పార్టీ అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే చరిత్రకెక్కనున్నారు. తండ్రి ఆశయాలు, విధానాలకు విరుద్ధంగా కాంగ్రెస్, ఎన్‌సీపీలతో చేతులు కలిపిన ఆయన సదరు కూటమి మహా వికాస్ ఆఘాడీ నేతగా వచ్చే నెల ఒకటో తేదీన పదవీ ప్రమాణం చేయనున్నారు. నిజానికి బాల్ ఠాక్రే గానీ, ఆయన తమ్ముడి కొడుకు రాజ్ ఠాక్రే (ఉద్ధవ్‌కు ముందు పార్టీ యువజన నేత) గానీ ఏ ఎన్నికల్లోనూ పోటీచేయలేదు. శివసేన-బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడినప్పుడు శివసేన నేతలైన మనోహర్ జోషీ, నారాయణ్ రాణే సీఎంలయ్యారు.

ఇప్పటివరకు ఉద్ధవ్ కూడా ఎన్నికల్లో పోటీచేయలేదు. ఆయన కుమారుడు, పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు ఆదిత్య ఠాక్రే ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో వొర్లి నుంచి పోటీచేసి గెలిచి ఠాక్రే కుటుంబం నుంచి చట్టసభలో అడుగుపెట్టిన తొలి వ్యక్తిగా రికార్డు సృష్టించారు. ఇప్పుడు సీఎం కాబోతున్న ఉద్ధవ్ 6 నెలల్లో అసెంబ్లీకి గానీ, శాసనమండలికి గానీ ఎన్నిక కావాలి. అయితే ఆయన ప్రత్యక్ష ఎన్నికల్లో గెలుపొంది అసెంబ్లీలో అడుగుపెట్టాలని భావిస్తున్నారు. శివసేన నుంచి ఒక ఎమ్మెల్యేతో రాజీనామా చేయించి అక్కడ ఉప ఎన్నికలో తలపడే అవకాశం ఉందంటున్నారు.

# వైద్య రంగంలో పరిశోధనలకు గీతం ప్రోత్సాహం

## క్లినికల్ రీసెర్చి వర్క్‌షాప్‌లో వైస్‌ఛాన్స్‌లర్ వెల్లడి



సాగర్‌నగర్‌: వైద్య రంగంలో పరిశోధనలకు ప్రోత్సహించడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం త్వరలో ''రీసెర్చి ఇంక్యుబేషన్ కేంద్రాన్ని '' నెలకొల్పనున్నదని వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ వెల్లడించారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్సర్ ) లో బుధవారం తేది: 27-11-2019న 'ఎమ్ఎస్ఎన్ ఇన్ క్లీనికల్ రీసెర్చి' వర్క్‌షాప్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హజరై ప్రారంభించారు. వైద్య రంగంలో ప్రతి రోజు విస్తృతమై రోగ నిర్ధారణ సమాచారం వైద్యులు సేకరిస్తున్నప్పటికీ దానిని శాస్త్రీయంగా విశ్లేషించి పరిశోధనా అంశంగా ఉపయోగించుకోవడంలో వైఫల్యం చెందుతున్నామన్నారు. బయో ఇన్ఫర్మేటిక్స్, బయోస్టాటిస్టిక్స్ పై గీతం వైద్య నిపుణులకు అవగాహన పెంచడానికి వరుసగా వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నామని ఆయన వెల్లడించారు. గీతం వంటి బోధనా అసుపత్రుల ద్వారా వైద్యులు పరిశోధనాంశాలపై దృష్టి సారించగలిగితే స్వల్ప కాలంలోనే పెద్ద ఎత్తున పరిశోధనా పత్రాలను వెలువరించవచ్చునని సూచించారు. వైద్యులకు గణితం, సంఖ్యాక శాస్త్రం (స్టాటిస్టిక్స్) పై అవగాహన కలిగించడానికి వర్క్‌షాప్ ఏర్పాటు చేశామన్నారు.

జిమ్సర్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ. జ్యోతి పద్మజ మాట్లాడుతూ వైద్య రంగంలో నిపుణులు వివిధ రకాల రోగాలకు చికిత్స అందించే సమయంలో విస్తారమైన రోగ సమాచారం నమోదవుతోందన్నారు. కొన్ని రోగాలకు ఒకే లక్షణాలు, వయస్సు, శరీర తత్వాన్ని బట్టి కనిపించే లక్షణాలు, చికిత్సాకాలం వంటి విలువైన సమాచారం విశ్లేషించాలంటే సంఖ్యాక శాస్త్రం (స్టాటిస్టిక్స్) తెలిసి ఉంటే మంచిదన్నారు. కార్యక్రమంలో ఎన్‌టిఆర్ ఆరోగ్య వైద్య విశ్వవిద్యాలయం మాజీ కులపతి, జిమ్సర్ ప్రొ-వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ సి.వి.రావు, జిమ్సర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్యామ ప్రసాద్, ఐఐఎమ్ నిపుణుడు ప్రొఫెసర్ కె.ఆర్. ఆర్. గాంధీ, గీతం సెంటర్ ఫర్ లెర్నింగ్ అండ్ సస్టైనబిలిటీ డైరక్టర్ ఎస్.ఎస్.ప్రసాద్‌రావు పాల్గొని ప్రసంగించారు.

# ఎస్డీఐకి మరో ప్రతిష్టాత్మక అవార్డు




ఆరిలోవ: హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో దీందయాళపురంలో నడుస్తున్న స్కిల్ డెవలప్ మెంట్ ఇన్స్టిట్యూట్‌ను మరో విశిష్టమైన అవార్డు వరించింది. న్యూ ఢిల్లీలో బుధవారం నాడు జరిగిన ఒక కార్యక్రమంలో అసోచాం వారి ద్వారా 'ఉత్తమ ప్రభుత్వరంగ నైపుణ్య శిక్షణా సంస్థ విభాగంలో పసిడి అవార్డును దక్కించుకుంది. కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి రాజ కుమార్ సింగ్ చేతులమీదుగా ఈ ప్రతిష్టాత్మక అవార్డును 2019 సంవత్సరానికి అందుకున్నామని, స్థాపించిన మూడేళ్ళలో వరుసగా మూడుసార్లు ఈ అవార్డును తమకు బహూహికరించడం, ఎంతో గర్వకారణమని ముఖ్య కార్యనిర్వాహక అధికారి కె.నగేష్ ఒక ప్రకటనలో తెలియజేసి, ఇందుకు కారణభూతులైన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు.

ఇలాంటి పురస్కారాలు తమకు మరింత ప్రోత్సాహాన్నిచ్చి, నిరుద్యోగ యువతకు సేవలను అందించడంలో ఉత్సాహాన్ని నింపుతాయని తెలియజేశారు.

# ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకై సంతకాల సేకరణ




విశాఖపట్నం: ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించరాదని కోరుతూ బుధవారం పోర్టు మెయిన్ గేటు వద్ద సంతకాల సేకరణ జరిగింది. ఈ సందర్భంగా యునైటెడ్ పోర్టు & డాక్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి వి.ఎస్.పద్మనాభరాజు మాట్లాడుతూ కేంద్రంలో రెండవ సారి అధికారం చేపట్టిన బిజెపి ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలపై దాడిని తీవ్రతరం చేసింది. పోర్టులు, బిపిసిఎల్, హెచ్‌పిసిఎల్, ఐఓసి, ఎయిర్ ఇండియా, రైల్వే, స్టీల్‌ప్లాంట్, బిహెచ్ఇఎల్, ఎన్‌టిపిసి, రక్షణరంగం, బ్యాంకులు, ఇన్సూరెన్స్ తదితర ప్రభుత్వరంగ సంస్థలన్నింటిని ప్రైవేటీకరణకు పూనుకుంటోంది. కీలకమైన ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకు సిఐటియు 10లక్షల సంతకాలు మరియు మహోద్యమానికి శ్రీకారం చుట్టింది.

ప్రభుత్వరంగ సంస్థలు ఏర్పాటు వలన విశాఖలో లక్షమందికి పర్మినెంట్ ఉద్యోగాలు, మరొక 6 లక్షల మందికి కాంట్రాక్టు, అసంఘటిత రంగంలో ఉపాధి లభించింది.

ఇప్పుడు మోడీ ప్రభుత్వం ప్రాధాన్యత దేశం, ప్రజలు, యువత అభివృద్ధికాదు. స్వదేశీ, విదేశీ కార్పొరేట్లు అభివృద్ధి కావాలి. అందుకే వీటిని కారుచౌకగావీరికి కట్టబెడుతున్నారు.

ఈ కార్యక్రమానికి విడిఎల్‌బి & డాక్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షుడు బి.లక్ష్మణరావు, యునైటెడ్ పోర్టు & డాక్ ఎంప్లాయిస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిహెచ్.త్రినాద్, అర్గనైజింగ్ కార్యదర్శి వి.రామలింగేశ్వరరావు, నగర కార్యదర్శి బి.జగన్, నాయకులు జె.సత్యనారాయణ, ఎల్లారావు నాయకత్వం వహించారు.

# ధరల పెరుగుదల నియంత్రణలో ప్రజాప్రతినిధులకు బాధ్యత లేదా?

- గ్రామీణ జిల్లాలో ఉల్లిపాయలు విక్రయ కేంద్రాలు తెరవాలి
- జిల్లా అధికార యంత్రాంగం స్పందించాలి
- జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ డిమాండ్



విశాఖపట్నం: నిత్యావసర సరుకుల ధరల అదుపునకు జిల్లా అధికార యంత్రాంగం తక్షణం చర్యలు తీసుకోవాలని జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ డిమాండ్ చేశారు. కొద్దికాలంగా ఉప్పెనలా ఎగసిపడుతున్న నిత్యావసరాలు, కాయగూరల ధరలు అదుపు విషయంలో ఇటు జిల్లా అధికార యంత్రాంగంగాని అటు ప్రజా ప్రతినిధులుగాని స్పందించలేదని ఆరోపించారు. ఓట్లు వేయించుకోవడంలో చూపిస్తున్న శ్రద్ధ రాజకీయపార్టీలు, ప్రజా ప్రతినిధులు (ఎమ్మెల్యేలు, ఎంపీలు) నిత్యావసరాల ధరల అదుపులో చూపకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌరసరఫరాలు శాఖ జారీ చేసిన ఆదేశాలు ప్రకారం ప్రతి రోజూ నిత్యావసర సరుకుల ధరల నియంత్రణపై సమీక్ష చేయాలి, అదే విధంగా ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి నియమిం చాల్సిన ధరల పర్యవేక్షణ కమిటీ పదేళ్లుగా నియామకానికి నోచుకోలేదన్నారు. నాలుగు నెలలుగా పనులు లేక కూలీలు నానా అవస్థలు పడుతున్న నేపధ్యంలో నిత్యావసరాల ధరలు పెరగడం మరింత భారమైందని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని సరకులైతే ఎన్నడూ లేని విధంగా వంద శాతంకు పైగా ధరలు పెరగడంతో సామాన్యులు కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంద న్నారు. పౌరసరఫరాలు, నిఘా విభాగం మార్కెట్‌లో నిల్వలపై దృష్టిసారించి కృత్రిమ కొరత లేకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలక్టర్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని కాండ్రేగుల వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు.

# బిల్డ్ ఆంధ్ర ప్రదేశ్ కు భూములు గుర్తించాలి

## జిల్లా కలెక్టర్ వి.వినయ్ చంద్



విశాఖపట్నం : జిల్లాలో వివిధ శాఖల వద్ద వృధాగా ఉన్న ప్రభుత్వ భూముల గుర్తింపు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టరు వి. వినయ్ చంద్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, వివిధ శాఖలకు గతంలో కేటాయించిన భూములలో కొంత భాగం వృధాగా ఉందని, వాటిని సద్వినియోగ పరిచేందుకు బిల్డ్ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో వివరాలను సేకరించాలని చెప్పారు. భూములను గుర్తించిన తర్వాత అందుకు గల కారణాలను విచారించి తగిన విధంగా అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక తయారు చేస్తామన్నారు. రెవెన్యూ, రహదారులు భవనాలు, వైద్య ఆరోగ్య, ఇంజనీరింగ్, విద్యుత్, పోలీస్, తదితర శాఖలకు సంబంధించి విశాఖ నగరం, గ్రామీణ ప్రాంతాలలో అవసరానికి మించి,నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవకుండా చూసేందుకు, వాటిని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అయితే విద్యాసంస్థలు, దేవాలయాలు, ప్రార్ధనా స్థలాల విషయంలో మినహాయింపు ఉంటుంది అన్నారు.

కొన్ని సంస్థలు ప్రజా ఉపయోగ లక్ష్యంతో ప్రభుత్వం నుండి భూములను తీసుకుని మరుగున పడి పోయినవి, మధ్యలో ఆగిపోయినవి ఇతర్రతా కారణాలతో ఏపీఐఐసీ తదితర సంస్థల ఆధీనంలో ఖాళీగా నిరుపయోగంగా ఉన్న భూముల జాబితాను తయారు చేయవలసినదిగా ఆదేశించారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఎల్. శివ శంకర్ పాడేరు సబ్ కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్, డి ఆర్ వో ఎం. శ్రీదేవి, ఆర్డీవోలు పెంచల కిషోర్, గోవిందరావు, సీతారామారావు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సారధి ఎస్ డి సి రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# అమెరికన్ కంపెనీలో గీతం విద్యార్ధులకు అవకాశం



సాగర్‌నగర్: అమెరికాలోని బోస్టన్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న స్టేట్ స్ట్రీట్ కార్పోరేషన్ నిర్వహించిన ప్రాంగణ నియామకాలలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన ముగ్గురు ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉద్యోగాలు లభించాయి.

గత రెండు రోజులుగా నిర్వహించిన ఈ ప్రాంగణ నియామకాలలో విద్యార్థులకు ఆన్‌లైన్ పరీక్ష, సాంకేతిక అంశాలపై ఇంటర్యూల అనంతరం ఈ ఎంపిక జరిగిందని గీతం ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ విభాగం డైరక్టర్ గురుమూర్తి గంగాధరన్ తెలిపారు. ఫార్చ్యూన్ 500 కంపెనీలలో ఒకటిగా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన స్టేట్ స్ట్రీట్ కార్పోరేషన్ అమెరికాలోని వివిధ బ్యాంకులకు సేవలు అందిస్తోందని ఆయన తెలిపారు.

ఎంపికయిన విద్యార్థులకు ఆఖరి సంవత్సరంలో ఉండగా వివిధ ప్రాజెక్టులలో పనిచేసే అవకాశం లభిస్తుందన్నారు. బ్యాంకింగ్, కార్పొరేట్ రంగాలలోని నూతన అంశాలపై ఎంపికయిన విద్యార్థులు పనిచేయవలసి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో రానున్న నెల రోజులలో ప్రఖ్యాత సంస్థలు కోరమండల్, విరజాన్, వెస్ట్ ఏంజల్ ల్యాబ్స్, అప్టాయిడ్ ప్రాంగణ నియమాకాలను నిర్వహించనున్నాయని ప్లేస్‌మెంట్ డైరక్టర్ తెలిపారు.

# ఘనంగా ప్రారంభమైన 12 గంటల నిర్విరామ వ్యక్తిత్వ వికాస ప్రసంగం




విశాఖ సిటీ: సఖీత్ క్రియేషన్స్ ఎం.డి., సంస్కృతి స్వచ్ఛంద సేవాసంస్థ సంయుక్త ఆధ్వర్యంలో లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ లో సరికొత్త రికార్డ్ నెలకొల్పడానికి పెందుర్తి సుజాతానగర్ లోని సుజాతానగర్ వెల్ఫేర్ కమ్యూనిటీ హాల్ లో ఉదయం 07.00 గంలకు విశాఖ వాసి డాక్టర్ ఎన్.సీతారామ కృష్ణారావు వ్యక్తిత్వ వికాస ప్రసంగం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని సంస్కృతి వాలంటరీ ఆర్గనైజేషన్ గౌరవాధ్యక్షులు ఎన్.ఎస్.వి.ప్రసాదరావు, సఖీత్ క్రియేషన్స్ ఎం.డి. గణేష్ రథో, సుజాతానగర్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ వి.రాఘవేంద్రరావు, సెక్రటరీ కె.త్రినాధరావు లిటిల్ ఫ్లవర్స్ హైస్కూల్ డైరెక్టర్ కల్లేపల్లి సత్యనారాయణ రాజు, ప్రిన్సిపల్ మంతెన పద్మావతి, ఎడ్యుకేషన్ సైకాలజిస్టు వై.రవి భార్గవ, ప్రముఖ న్యాయవాది మళ్ళ తులసీరామ్, సీనియర్ జర్నలిస్ట్ వాల్మీకి నాగరాజులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ కార్యక్రమం ఆద్యంతం వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ చీఫ్ కోఆర్డినేటర్ కోరుకొండ రంగారావు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ జిల్లా ఇన్‌చార్జి వేముల భాస్కరాచారి పర్యవేక్షణలో జరుగుతుంది. ప్రోగ్రామ్ అడ్వజర్ వేముల భాస్కరాచారి మాట్లాడుతూ 12 గంల నిర్విరామంగా డా కృష్ణారావు వ్యక్తిత్వ వికాస ప్రసంగం జరుగుతుందని రాత్రి 07.00 గంలకు జరగబోయే ముగింపు ఉత్సవానికి రాజకీయ మరియు విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలు అతిథులుగా పాల్గొననున్నారని తెలియజేసారు.

# మద్ది గరువులో మావోయిస్టులకు వ్యతిరేకంగా గిరిజనుల ర్యాలీ



మావోయిస్టులారా
మమ్మల్ని ప్రశాంతంగా జీవించనివ్వండి.
మావోయిస్టులారా
మా కుటుంబ సభ్యులను చంపద్దు.
మావోయిస్టులారా
మా ప్రాంత అభివృద్ధిని అడ్డుకోవద్దు.
మాకు రోడ్లు, విద్యా, వైద్యం కావాలి
అడ్డుకోవద్దు. సెల్ టవర్లు కావాలి.
అడ్డుకోవద్దు.

విశాఖ రూరల్: మద్దిగరువు లో మావోయిస్టు బాధిత కుటుంబాలు ప్లకార్డులు పట్టుకొని మొత్తం 600 మంది గిరిజనులు కుటుంబ సమేతంగా ర్యాలీ నిర్వహించారు. తాము ఏ స్థాయిలో మావోయిస్టుల వలన తమ జీవితాలు సర్వనాశనమయ్యాయో భాహ్య ప్రపంచనికి తమ కన్నీటి ధారలతో గొంతు చించుకుని ఈ క్రింది విధంగా మావోయిస్టు లను ప్లకార్ల ద్వారా ప్రశ్నిస్తున్నారు

1. మావోయిస్టులారా మమ్మల్ని ప్రశాంతంగా జీవించనివ్వండి. 2. మావోయిస్టులారా మా కుటుంబ సబ్యులను చంపద్దు. 3. మావోయిస్టులారా మా ప్రాంత అభివృద్ధిని అడ్డుకోవద్దు 4. మాకు రోడ్లు, విద్యా వైద్యం కావాలి అడ్డుకోవద్దు 5. సెల్ టవర్లు కావాలి అడ్డుకోవద్దు

అని ముద్ది గరువు ఊరిలో ర్యాలీ చేసి తమ నిరసనను తెలియజేశారు అక్కడ ర్యాలీ చేస్తున్న ఏ ఒక్క గిరిజనుడిని కదిపినా ఒక కన్నీటి గాథ వినిపిస్తున్నది వారి మాటలలో........

మన్యంలో మావోయిస్టులు అతి కూరంగా హత్యలు చేసి ఆనక మీకోసమే మావోయిస్టులు అని మభ్యపెడుతున్నారు. తేనెపూసిన మాటలు, డప్పుల హోరు, మాయ మాటలు, పాటలు, తుపాకి రాజ్యం అని గిరిజనులను ఊహల్లో విహరింప చేసి నిజం తెలిసిన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. మావోల పనులు చేయని వారిని, ఎదురు తిరిగి నిజాన్ని నిగ్గ దీసిన గిరిజనులను, డబ్బులు ఇవ్వని అమాయకులను పోలీస్ ఇన్ఫార్మర్ అనే పేరుతో, హత్యలు చేసి గిరిజనుల్లో మావోలంటే భయం శాశ్వతంగా ఉండేందుకు వాళ్ల ఆయుధాలు పదును కోల్పోకుండా ఎప్పటికప్పుడు గిరిజనుల గుత్తు కులపై శాన బెడుతూ క్రూరంగా చంపుతున్నారు

మావోయిస్టుల్లో స్థానిక గిరిజనుల ప్రాతినిధ్యం ఎప్పుడో కోల్పోయింది. మావోయిస్టుల కుతంత్రాలు తెలుసుకుని లొంగిపోవడం అభివృద్ధిని అడ్డుకుంటున్న మావోయిస్టుల ద్వంద్వ నీతిని సహించనివారు దళాలకు దూరంగా ఉంటున్నారు. మావోయిస్టు దళాల్లో రిక్రూట్మెంట్ లేక ఈ ప్రాంతం వారు ఎవరు చేరకపోవడం వల్ల వేరే రాష్ట్రాల నుంచి ఇక్కడ భాష రానివారిని అమాయక పి.టి.జి తెగలకు చెందిన గిరిజనులను వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని వారి వెంట తిప్పుకుంటున్నారు. వన్యమృగం పై తాము పయనిస్తు న్నామని తెలిసిన నాటికి ఆ మృగానికి బలైపోతున్నారు.

మన్యంలో ఎటువంటి సమస్యలు లేకపోయినా ఏదో జరిగిపోతుందని లేనిపోని అపోహలు గిరిజనులకు కల్పించి, గిరిజనులను మభ్యపెట్టి అభివృద్ధి చెందకుండా గిరిజనులకు ప్రభుత్వ పథకాలు అలకుండా చేస్తు న్నారు

మావోయిస్టులు ఊతం పలికేవారు మావోయిస్టులు గిరిజనులను చంపితే ఒప్పని, ప్రజల చేతులలో మావోయిస్టులు చనిపోతే తప్పని వంతపాడుతున్నారు. ఉదాహరణకు వీరవరం సంఘటనే సాక్ష్యం. వీరవరం గ్రామాన్ని వదిలేసి వేరే ప్రాంతంలో బతుకుతున్న గిరిజనులు 1. గెమ్మిళి భాస్కర రావు, 2. పాంగి సత్తిబాబు లు తమ గ్రామంపై ప్రేమతో తిరిగి వచ్చి ప్రశాంతంగా వ్యవసాయం చేసుకుంటున్న వీరిని ఆనాటి పగతో మావోయిస్టులు వీరిని క్రూరంగా చంపేశారు.

అలాగే 1. కొలకాని సూర్యచంద్ర బాబు, మొబైల్ ఫోన్ల వ్యాపారం, మద్ది గరువు 2. ముక్కాలి కిశోర్, డిగ్రీ విద్యార్థి, మద్ది గరువు 3. వంతల సత్యారావు, వ్యవసాయం, మడతకొండ గ్రామం, 4. బచ్చల బాలకృష్ణ, కిల్లంకోట గ్రామం, 5. గెమ్మెలీ నాగరాజు, వ్యాన్ డ్రైవరు. మత్స్యపురం గ్రామం మొదలైన జి.మాడుగుల ప్రాంతానికి చెందిన వీరిని మావోయిస్టులు చంపేశారు. వారి కుటుంబాలు దిక్కు తోచని వారైనారు, నేటికీ ఆ కుటుంబాలు మావోయిస్టుల నిర్భందాలకు గురవుతున్నారు. ఈ

ఒక వైపు బాధిత కుటుంబాలు తమ గోడు వెలబోసుకొంటుంటే సహించలేక మావోయిస్టు మిలీషియా సభ్యులు కొన్ని గ్రామాల నుంచి అమాయక గిరిజనుల్ని తమ సాటి గిరిజనులకు వ్యతిరేకంగా ఉసిగొల్పి పంపించారు. అయితే, సాటి గిరిజనుల కడుపుకోతని అర్థం చేసుకుని మద్ది గరువుకి రాకుండానే వెనుదిరిగి వెళ్లిపోవడం శుభపరిణామం. అంతే కాకుండా, తమకి అభివృద్ధి కావాలని ముక్తకంఠంగా వారు చెప్పడం జరిగింది.

ఇంతకు క్రితం మేము మా భాధను చెప్పుకోవడానికి మైదాన ప్రాంతాలకు వెళ్ళి అక్కడి అధికారులకు మా మొర వినిపించుకున్నాం కొంతవరకు విజయం సాధించాము, కానీ మేము కోల్పోయిన ప్రాంతలోనే మా ఉనికిని కాపాడుకోవడానికి మేము వేస్తున్న ఈ అడుగు రేపటి మా భావితరాలకు మన్యానికి పట్టిన చీడ విరుగుడుగుకి ఇది నాంది ప్రస్థానం ఇక ముందు మా ఆత్మఘోష ప్రజాపోరాటంగా మార్పు చెంది మావోయిస్టుల వినాశనానికి తప్పక దారితీస్తుందని ఆశిస్తున్నామన్నారు

# విజయభాను సంపాదకీయం

## పెరుగుతున్న ప్రమాదాలు

దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు, మరణాల సంఖ్య పెరుగుతున్న తీరు ఆందోళన కలిగిస్తున్నది. కేంద్ర రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వశాఖ విడుదల చేసిన రోడ్డు ప్రమాదాల నివేదిక- 2018 ఇదే వాస్తవాన్ని చాటిచెబుతున్నది. గతంలో వలె తమిళనాడు, మధ్యప్రదేశ్ ప్రథమ, ద్వితీ య స్థానాల్లో నిలిచాయని కేంద్ర నివేదిక తెలియజేయటం గమనార్హం. దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల్లో తెలంగాణ 8వ స్థానంలో నిలిచింది. కొన్నేండ్లుగా రాష్ట్ర పోలీసులు రోడ్డు ప్రమాదాల నివారణ కోసం, ముఖ్యంగా నగరాల్లో చేపడుతున్న ప్రత్యేక చర్యల నేపథ్యంలో కూడా తాజా గణాంకాలు భీతిగొలిపేవిగానే ఉన్నాయి. ఈ ఏడాది తెలంగాణలో 6,051 రోడ్డు ప్రమాదాలు జరిగితే, ఇందులో జాతీయ రహదారులపై 2,064, రాష్ట్ర రహదారులపై 1,165 ప్రమాదాలు జరిగాయని కేంద్ర నివేదిక తెలిపింది. ఈ ప్రమాదాల్లో రాష్ట్రవ్యాప్తంగా 6,603 మంది ప్రాణాలు కోల్పోగా, హైదరాబాద్‌లోనే 2,846 మంది చనిపోయారు. ఈ మధ్యనే హైదరాబాద్ నగరంలో జరిగిన రోడ్డుప్రమాదాలు ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. మాదాపూర్‌ఫ్లై ఓవర్‌పై అతివేగంతో దూసుకుపోయిన కారు రోడ్డుపై పడి ఓ మహిళ చనిపోయింది. మరో ఘటనలో రాంగ్‌రూట్‌లో దూసుకుపోయిన కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ఓ ఐటీ ఉద్యోగి ప్రాణాలు కోల్పోగా మరో మహిళా ఉద్యోగి తీవ్రగాయాలతో ప్రాణాపాయ స్థితిలో దవాఖానలో చికిత్స పొందుతున్నది. ఈ రోడ్డు ప్రమాదాల్లో అతివేగంతో వాహనాలు నడిపినవారితో పాటు, ఏ సంబంధం లేని రోడ్డు ప్రయాణికులు కూడాప్రాణాలు కోల్పోతున్న తీరు పెద్ద విషాదం. ఆధునికాభివృద్ధికి రోడ్డు రవాణా వ్యవస్థలను సంకేతంగా భావిస్తారు. ఎంత నాణ్యతతో కూడి న రోడ్డు రవాణా రహదారులు విస్తరించి ఉంటే అంతగా అభివృద్ధి చెందినదని చెబుతారు. గత రెండు దశాబ్దాలుగా ఆధునికాభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రోడ్డు, రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నాయి. పల్లెలను పట్టణాలతో అనుసంధానం చేస్తున్నారు. రవాణా సౌకర్యాలతో వర్తక వాణిజ్యాలను వృద్ధిపరుస్తూ ఆధునికాభివృద్ధికి బాట లు వేస్తున్నారు. అయితే రోడ్డు ప్రమాదాలు కూడా అదేస్థాయిలో పెరిగిపోతున్న తీరు ఆందోళన కలిగిస్తున్నది. దేశంలో సగటున గంటకు 55 ప్రమాదాలు జరుగుతున్నాయి, 17 మంది చనిపోతున్నారు. దేశవ్యాప్తంగా రోజుకు సుమారు 400 మంది మృత్యువాత పడుతున్నారు. ఈ ప్రమాదాలన్నింటికీ ప్రధాన కారణం రోడ్డు నియమ నిబంధనల పట్ల అవగాహన లేకపోవటమే. రాంగ్‌రూట్‌లో వాహనం నడుపటం, సిగ్నల్ అతిక్రమించ డం, అతివేగం, మద్యం తాగి లేదా, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ నడుపటం వంటివి ప్రమాద హేతువులని అధ్యయనాలు తెలుపుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నా ఆశించిన ఫలితాలుండటం లేదు. రోడ్డు నియమాలు అతిక్రమించినవారిపై భారీ జరిమానాలు, జైలుశిక్షలు విధిస్తున్నా ప్రమాదాల జోరు తగ్గకపోవటానికి కారణం ప్రధానం నియమాలు పాటించే సోయి సమాజంలో లేకపోవటమే. ప్రమాదం జరిగి మనిషి ప్రాణాలు కోల్పోగానే రోడ్డు నిర్మాణ తీరు, నిర్వహణా లోపాలను ఎత్తిచూపటంలో చూపుతున్న ఆసక్తి, నిబంధనలు పాటించటంలో చూప కపోవటం విషాదం. మైనర్లు ద్విచక్ర వాహనాలు, కార్లు అతివేగంతో నడుపుతూ ప్రమాదాలకు కారణమైన ఘటనలు అనేకం. రాష్ట్ర పోలీసులు వాహనాలు నడుపుతున్న మైనర్లకు, వాహన యజమానులైన తల్లిదండ్రులకూ అవగాహనా కార్యక్రమాలను చేపట్టడంతోపాటు, ప్రమాదాల పర్యవసానాలను తెలుపుతూ చైతన్యం పెంచుతున్నారు. ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రప్రభుత్వం ఈ ఏడాది సెప్టెంబర్ ఒకటిన కొత్త మోటారు వాహన చట్టాన్ని తీసుకొచ్చింది. రోడ్డు నిబంధనల అతిక్రమణలకు భారీ జరిమానాలతో పాటు శిక్షలను కూడా పెంచింది. దీనిపై కొన్ని విమర్శలున్నా ఈ చట్టం వచ్చిన తర్వాత రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గిన వాస్తవాన్ని గుర్తించాలె. పుదుచ్చేరిలో 31 శాతం, ఉత్తరాఖండ్ లో 22 శాతం, గుజరాత్‌లో 14 శాతం, బీహార్, ఉత్తరప్రదేశ్‌లో 10 శాతం ప్రమాదాలు తగ్గాయి. యూరప్ దేశాలకన్నా మన దేశంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరుగటానికి నిబంధనలు పాటించకపోవటం, బాధ్యతారాహిత్యమే ప్రధానకారణం. మోటారు వాహనం అతివేగాన్ని నియంత్రించి, వాహనం నడుపుతున్నవారిని హెచ్చరించే ఒక స్మార్ట్ ఎక్లిప్స్ అనే పరికరాన్ని కేరళ రాష్ట్రంలో ఈ మధ్యనే అభివృద్ధి చేశారు. పరిమితికి మించి వేగంగా వాహనం వెళ్తున్నట్లయితే వెంటనే ఈ పరికరం వాహన డ్రైవర్‌ను హెచ్చరిస్తుంది. అలాగే వాహనం ఇంజిన్‌ను అది నిలిపివేస్తుంది. ఈ స్మార్ట్ ఎక్లిప్స్ అభివృద్ధి కోసం 140 కోట్ల విదేశీ పెట్టుబడులు కూడా సమకూరాయి. స్మార్ట్ ఎక్లిప్స్ కోసం వంద దేశాల నుంచి ఆర్డర్లు వచ్చాయంటే ఆ పరికరం పనివిధానం ఎంత ఉపయోగకరమో ఊహించుకోవచ్చు.

# బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ సన్నిధిలో విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానందేంద్ర..!

### నిర్మల్ జిల్లాలో విశాఖ శ్రీ శారదాపీఠం ఉత్తరాధికారి హిందూ ధర్మ ప్రచారయాత్ర

### బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ ఆలయాన్ని దర్శించుకున్న శ్రీ స్వాత్మానందేంద్ర

### శ్రీ స్వాత్మానందేంద్రకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికిన అర్చకులు, అధికారులు

### శ్రీ స్వాత్మానందేంద్ర హిందూ ధర్మ ప్రచారయాత్రకు అపూర్వ స్పందన



బాసర : సకల జ్ఞానాలను ప్రసాదించే చదువుల తల్లి, బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారిని దర్శించుకోవడంతో తన జన్మ ధన్యమైందని విశాఖ శ్రీ శారదాపీఠం ఉత్తరాధికారి శ్రీ శ్రీ శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామివారు అన్నారు. హిందూ ధర్మ ప్రచారయాత్రలో భాగంగా గత రెండు రోజులుగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పర్యటిస్తున్న శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి బుధవారం మధ్యాహ్నం బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన శ్రీ స్వాత్మానందేంద్రకు ఆలయ ప్రధాన అర్చకులు, పూజారులు, అధికారులు వేద మంత్రోచ్ఛా రణల మధ్య పూర్ణ కుంభంతో సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆలయంలో శ్రీ సరస్వతి అమ్మ వారికి స్వామిజీ స్వయంగా హారతినిచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శ్రీ స్వాత్మానందేంద్ర మాట్లాడుతూ గురువర్యులు విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ స్వరూపా నందేంద్ర సరస్వతి ఆదేశాల మేరకు భారతదేశ మంతటా హిందూ ధర్మ ప్రచారయాత్ర చేపట్టినట్లు తెలిపారు. ముందుగా తెలంగాణ నుంచి యాత్ర ప్రారంభించి ఇప్పటి వరకు ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం, హైదరాబాద్, మెదక్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో దాదాపు 6000 కి.మీ. మేర యాత్ర పూర్తయిందని స్వామిజీ అన్నారు. దేశంలో ఉన్న మహిమాన్విత సరస్వతి క్షేత్రాలలో బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ క్షేత్రం మిక్కిలి ప్రాశస్త్యం కలదని, ఇక్కడ అమ్మవారి సన్నిధిలో అక్షరాభాస్యం చేస్తే సకల జ్ఞాన సంపన్నులు అవుతారని, అంతటి శక్తివంతమైన క్షేత్రం..ఈ బాసర క్షేత్రమని కొనియాడారు. శ్రీ సరస్వతి అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని ప్రార్థించినట్లు స్వామిజీ అన్నారు. తాను చేపట్టిన హిందూ ధర్మ ప్రచారయాత్రను తెలంగాణ ప్రజలు ఎంతగానో ఆదరిస్తున్నారని, అలాగే ప్రభుత్వం కూడా అన్ని వధాల సహకరిస్తుందని శ్రీ స్వాత్మానందేంద్ర హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బాసర సర్పంచ్ డి. లక్ష్మణ్ రావ్, ఆలయ అధికారులు, సిబ్బంది, బాసర ఎస్ఐ రాజు, హిందూ ధర్మ ప్రచారయాత్ర తెలంగాణ సమన్వయకర్త, దరువు ఎండీ సీహెచ్ కరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## తిరుపతి విమానాశ్రయంలో విశ్రాంతి మందిరం నిర్మాణానికి గాను భూమి కేటాయింపునకు ఆమోదం తెలిపిన మంత్రిమండలి

తిరుపతి : తిరుపతి విమానాశ్రయం లో విశ్రాంతి మందిరాన్ని నిర్మించేందుకు ఆంధ్ర ప్రదేశ్ ఎడ్యుకేశన్ ఎండ్ వెల్ ఫేయర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డివెలప్‌మెంట్ కార్పొరేశన్ (ఎపిఇడబ్ల్యుఐడిసి)కి- భారత విమానాశ్రయాల ప్రాధికరణ సంస్థ (ఎఎఐ) కు చెందిన 1800 చ.మీ. మేర భూమి ని సంవత్సరాని కి ఒక రూపాయి వంతున నామమాత్ర లైసెన్సు రుసుము ధర తో 15 సంవత్సరాల కాలాని కి- కేటాయించేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షత న జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది.

లాభాలు:

భగవాన్ శ్రీ వేంకటేశ్వరుని నివాస స్థానం కావడం వల్ల తిరుపతి కి అతి విశిష్ట వ్యక్తులు/ విశిష్ట వ్యక్తులు తరచు గా పయనమై వస్తుంటారు. ఇక్కడ ఒక విశ్రాంతి మందిరాన్ని నిర్మించడం వల్ల సందర్శకుల కు మెరుగైన సౌకర్యాలు లభ్యమ వుతాయి. ఈ విశ్రాంతి మందిరాన్ని ఎపిఇడబ్ల్యు ఐడిసి పర్యవేక్షిస్తుంటుంది.

## భవిత కేంద్ర విద్యార్థులకు ప్రత్యేక భోజనం



అచ్యుతాపురం : స్థానిక భవిత కేంద్ర దివ్యాంగ విద్యార్థులకు ఆవరాజం పాఠశాల ఉపాధ్యాయిని మజ్జి రామలక్ష్మి కార్తీకమాసం పోలిస్వర్గం సందర్భంగా బుధవారం ప్రత్యేక భోజనం ఏర్పాటు చేశారు . ఉపాధ్యాయిని రామలక్ష్మి తమ పాఠశాల పిల్లలకే కాకుండ ఇతర పాఠశాల పిల్లలకు సేవా కార్యక్రమాలు చేయడం పట్ల తోటి ఉపాధ్యాయులు అభినందించారు . ఈ కార్యక్రమంలో శ్రీనివాసురాజు , శేకర్ ,జగదాంబ తదితరులు పాల్గొన్నారు .

## కవి సమయం

### 'లేవండి... మేల్కొనండి...'

జాతిని మేల్కొల్పి
జన్మించి
మనిషికి మూఢ విశ్వాసం
ప్రబల శత్రువని
మనసుని బలహీనపరచే
వినాశనకారి అని తెల్పి
వీటిని అధిగమింప
దివ్య ఉపనిషత్తులను
ఆశ్రయించమని
ప్రభోధించి
స్పందించే హృదయం
ఆలోచించే మెదడు
సహాయ పడే గుణం
యువతకు ప్రథమ లక్షణమని
ఓ... నా ధీర వత్సలారా...
లేవండి... మేల్కొనండి...
మహత్కార్యాలు సాధించడానికే
మనం జన్మించామని
యువకులను సంఘటిత పరచడానికి
తాను జన్మించానని
ఎలుగెత్తి చెప్పిన
మార్గదర్శకుడు
వివేకానందుడు.

...రచయిత
ఆర్.శంకర్
సెల్ నెం:9849213779

# పంచాంగం

మాసం : మార్గశిర; తిథి: విదియ రా.7.02; జ్యేష్ఠ ఉ.9.07; సా.వ.5.10ల 6.47.

గురువారం 28-11-2018

**మేషం** : విద్యార్థులకు హడావుడి, తొందరపాటు తగదు. పెద్దల సలహాను పాటించండి మీ గౌరవాన్ని నిలబెట్టుకుంటారు. రాబడికి మించిన ఖర్చులు తప్పనిసరి చెల్లింపులు వల్ల ఆటుపోట్లు తప్పవు. మీ సంతానం ఉన్నత విద్యల కోసం కొత్తకొత్త ప్రణాళికలు రూపొందిస్తారు. అవివాహితుల్లో నూత నోత్సాహం చోటుచేసుకుంటుంది. **వృషభం:** ఆర్థిక లావాదేవీలు, వ్యాపారాలు సంతృప్తికరంగా సాగుతాయి. ఇతరుల ముందు వ్యక్తిగత విషయాలు వెల్లడించడం మంచిది కాదని గమనించండి. బంధువుల రాకతో గృహంలో సందడి కానవస్తుంది. విద్యార్థుల మొండివైఖరి ఎంతో చికాకు కలిగిస్తుంది. హామీలు, మధ్యవర్తిత్వాలకు దూరంగా ఉండటం మంచిది. **మిథునం** : ఉద్యోగస్తులకు పైఅధికారుల నుంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. వాహనం నడుపునపుడు మెళకువ అవసరం. బంధుమిత్రులతో సఖ్యత నెలకొంటుంది. స్త్రీలకు ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతాయి. ప్రభుత్వ కార్యక్రమాలలోని పనులు వాయిదా పడతాయి. రాజకీయ నాయకుల పర్యటనల్లో ఇబ్బందులు ఎదుర్కొనక తప్పదు. **కర్కాటకం** : ప్రేమికుల మధ్య అభిప్రాయ భేదాలు తలెత్తుతాయి. ప్రయాణాలు చికాకు పరుస్తాయి. కొబ్బరి పండ్లు, పూల నిత్యావసర వస్తు వ్యాపారులకు స్టాకిస్టులకు కలిసిరాగలదు. హుందాగా మెలిగి అందరినీ ఆకట్టుకుంటారు. బంధువులతో సంబంధాలు మెరుగుపడతాయి. విద్యా సంస్థలలోని ఉపాధ్యా యులకు ఒత్తిడి అధికంగా ఉంటుంది. **సింహం** : ఉపాధ్యాయులకు యాజమాన్యం ఒత్తిడి అధికం. ప్రముఖుల కలయిక సాధ్యం కాదు. ఆహార వ్యవహారాల్లో మెలకువ వహించండి. అపరిచిత వ్యక్తులు తప్పుదారి పట్టించేం దుకు యత్నిస్తారు జాగ్రత్త వహించండి. మీ ప్రమేయం లేకున్నా మాటపడవలసి వస్తుంది. వైద్య రంగాల వారికి అన్ని విధాల కలిసిరాగలదు. **కన్య** : ఉపాధ్యా యులకు, మార్కెటింగ్ రంగాల వారికి ఒత్తిడి అధికమవుతుంది. అనుకోకుండా పాత బాకీలు వసూల వుతాయి. వ్యాపారాల్లో కొత్తకొత్త పథకాలతో కొనుగోలుదార్లను ఆకట్టుకుంటారు. బంధువుల నుంచి సమస్యలు తలెత్తుతాయి. స్త్రీలకు అయిన వారి నుంచి ఒక ముఖ్య సమాచారం అందుతుంది. **తుల** : హుందాగా మెలిగి అందరినీ ఆకట్టుకుంటారు. విద్యా సంస్థలోని వారికి ఒత్తిడి, తిప్పట అధికం. నిరుద్యోగులు చేపట్టిన ఉపాధి పథకాలకు ప్రోత్సహం లభిస్తుంది. విదేశాల్లోని అభిమానుల క్షేమసమాచారం ఆందోళన కలిగిస్తుంది. విద్యార్థులకు ఒత్తిడి, విశ్రాంతి లోపం వంటి చికాకులు ఎదురవుతాయి. **వృశ్చికం** :కుటుంబీకులతో కలిసి విందు వినోదాల్లో పాల్గొంటారు. చెల్లింపులు, చెక్కుల జారీలో జాగ్రత్త. దంపతుల మధ్య అకారణకలహం, చికాకులు తలెత్తుతాయి. ప్రియతములతో ఉల్లాసంగా గడుపుతారు. ఉద్యోగ బాధ్యతల్లో తప్పిదాలు దొర్లే సూచనలు ఉన్నాయి. దళారులు, బోగస్ సంస్థల పట్ల అప్రమత్తంగా ఉండాలి. **ధనుస్సు** : స్త్రీలకు తల కళ్లు నరాలకు సంబంధించిన చికాకులు అధికమవుతాయి. కోర్టు వాజ్యాలు ఉపసంహరించుకుంటారు. మీ అతిథి మర్యాదలు అందరినీ సంతృప్తిపరుస్తాయి. నిరుద్యోగులకు ఉపాధి పథకాల్లో క్రమంగా నిలదొక్కు కుంటారు. చిన్ననాటి పరిచయస్తులను కలుసుకుంటారు. ఉమ్మడి వెంచర్లు, లీజు, ఏజెన్సీలకు అనుకూలం. చిన్నతరహా పరిశ్రమలలో వారికి శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. క్రయ విక్రయాలు సామాన్యం. **మకరం** : సహోద్యోగుల సాయంతో ఒక సమస్య నుంచి బయటపడతారు. రుణాల కోసం అన్వేషిస్తారు. స్త్రీలకు నరాలు, కళ్లు దంతాలకు సంబంధించిన సమస్య లెదురవుతాయి. మీ సంతానం మొండివైఖరి మీకు ఎంతో చికాకు కలిగిస్తుంది. ప్రముఖుల కలయిక ప్రయోజనకరంగా ఉంటుంది. ఆలయాలను సందర్శిస్తారు. **కుంభం** : కుటుంబ ఆర్థిక విషయాలు గోప్యంగా ఉంచండి. పొదుపు చేయాలన్న ఆలోచన ఫలించదు. హోటల్, కేటరింగ్ రంగాల్లో వారు పనివారితో ఇబ్బందులు ఎదుర్కొంటారు. స్త్రీలకు పరిచయాలు, వ్యాపకాలు అధిక మవుతాయి. బ్యాంకు పనుల్లో జాప్యం వల్ల ఇబ్బందు లెదుర్కొంటారు. దూర ప్రయాణాలు అనుకూలిస్తాయి. స్వర్ణకారులు, బంగారు వ్యాపారులకు పని వారలతో చికాకులు తప్పవు. **మీనం** : గృహంలో ప్రశాంతత నెల కొంటుంది. రోజువారీ ఖర్చులే ఉంటాయి. పొదుపు పథకాలపై దృష్టి సారిస్తారు. సంబంధాలు, పరి చయాలు బలపడతాయి. పనులు నెమ్మదించినా అనుకున్న విధంగా పూర్తి చేస్తారు. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణం క్షేమం కాదు. సంతానం చదువుల పట్ల మరింత శ్రద్ధ వహించాలి.

## ర్యాలి క్షేత్రానికి అందుకే ఆ పేరు వచ్చిందట!



శ్రీమహావిష్ణువు లోక కల్యాణం కోసం ధరించిన రూపాలలో జగన్మోహిని రూపం ఒకటి. దేవతల నుంచి అమృతాన్ని దక్కించుకోవడానికి అసురులు ప్రయత్నిస్తూ వుండగా, వాళ్లకి అమృత భాండం చిక్కకుండా చేయడం కోసం స్వామి జగన్మోహిని రూపాన్ని ధరించాడు. అలా స్వామి తాను అనుకున్న కార్యాన్ని పూర్తిచేసిన తరువాత, పరమశివుడి కంటపడతాడు. జగన్మోహిని సౌందర్య విశేషం సదాశివుడిని ఆశ్చర్యచకితుడిని చేస్తుంది. విష్ణు మాయ కారణంగా ఆకర్షితుడైన శివుడు .. జగన్మోహినిని అనుసరి స్తాడు. ఆయన వెంబడిస్తుండటం గమనించిన జగన్మోహిని తన నడక వేగాన్ని పెంచుతుంది. అలా హడావిడిగా ఆమె వెళుతూ వుండగా ఆమె తలలో తురుముకున్న పుష్పం ఒకటి 'రాలి' పడిపోతుంది. లోక కల్యాణం కోసం వచ్చిన జగన్మోహిని తలలోని పుష్పం 'రాలి' పడిన ప్రదేశం కనుక, ఈ ప్రదేశానికి 'ర్యాలి' అనే పేరు వచ్చిందననేది ఒక కథగా చెబుతారు. ఒకే మూలమూర్తికి ముందు భాగంలో కేశవస్వామి దర్శనమిస్తూ ఉండగా, వెనుక భాగంలో జగన్మోహిని రూపం కనిపిస్తుంది. తూర్పుగోదావరి జిల్లాలోని ఆత్రేయపురం మండలం పరిధిలో ఈ క్షేత్రం అలరారుతోంది. అత్యంత ప్రాచీనమైన ఈ క్షేత్రాన్ని దర్శించడం వలన, విశేషమైన ఫలితాలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తుంటారు.

## చెన్నకేశవస్వామి మహిమ!



శ్రీమహావిష్ణువు .. శ్రీచెన్నకేశవస్వామిగా ఆవిర్భవించిన క్షేత్రాలలో ఒకటిగా 'ఉల్లిపాలెం' కనిపిస్తుంది. కృష్ణా నది పరివాహక ప్రాంతంలోని మహిమాన్వితమైన క్షేత్రాలలో ఇది ఒకటిగా వెలుగొందుతోంది. 'నగరం' మండలంలోని ఈ క్షేత్రంలో శ్రీ భూ నీలాదేవి సమేత చెన్నకేశవస్వామి పూజాభిషేకాలు అందుకుంటూ వస్తున్నాడు. ఇక్కడ స్వామి కొలువుదీరడం వెనుకనే ఆయన మహిమ ఎంతటిదో తెలుస్తుంది. పూర్వం ఇక్కడి గ్రామంలోని జమీందారుకి కలలో స్వామివారు కనిపించి తన జాడ తెలియజేసి, తనని ఈ గ్రామంలో ప్రతిష్ఠించి పూజించమని చెప్పాడట. అయితే ఇది సాధారణమైన కలే అనుకుని ఆయన తన దైనందిన కార్యక్రమాల్లో నిమగ్నమై వున్నాడు. దాంతో మరుసటి రోజు రాత్రి ఆయనకి స్వామి మళ్లీ స్వప్నంలో కనిపించడమే కాకుండా, తాను చెప్పిన విషయాన్ని మరోమారు గుర్తుచేశాడట. అంతేకాకుండా వెంటనే తన మూర్తిని ఆ గ్రామానికి తరలించమంటూ తట్టి లేపాడట. అప్పుడు ఆయన ఆ పనికి పూనుకుని 'అల్లపర్రు'లోని స్వామివారి ప్రతిమను 'ఉల్లిపాలెం' చేర్చారట. అలా స్వామి తమ గ్రామానికి కోరి వచ్చాడు కనుక, ఇక్కడి ప్రజలంతా స్వామిని తమ ఇష్టదైవంగా భావిస్తుంటారు. అనునిత్యం ఆ స్వామిని కొలుస్తూ తరిస్తుంటారు.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2560004

**CHANGE OF NAME**

I, the undersigned **PAKKI VENKATA SURYA KAMALA SAI SREE MEGHANA DEEPTHI ROY** **( Old Name )** **D/o. PAKKI KISHORE** R/o.10-5-9, Ramnagar, Opp.Old Raghu College, VSP, hereby change my name from PAKKI VENKATA SURYA KAMALA SAI SREE MEGHANA DEEPTHI ROY (Old Name) to **PAKKI MEGHANA DEEPTHI ROY** (New Name) henceforth I shall be called as **PAKKI MEGHANA DEEPTHI ROY** for all purposes.

## రాయితీపై పెరటికోళ్లు

నాతవరం : ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు రాయితీపై పెరటికోళ్లు అందజేస్తుందని వెలుగు ఏపిఎం మంగ తెలిపారు. లబ్ధిదారుడు రూ.850 చెల్లిస్తే రూ.3330 విలువైన 45 పెరటికోళ్లు అందజేస్తామన్నారు. ఆసక్తి గల లబ్ధిదారులు ఆధార్, రేషన్ కార్డు జెరాక్స్ కాఫీలతో పాటు నగదు వెలుగు కార్యాలయానికి అందజేయాలని కోరారు.

## ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అక్రమ మద్యంపై దాడులు

పెద్దాపురం : ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నాటు సారాయి మరియు అక్రమ మద్యం అరికట్టుటకై ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎంఆర్‌కె.దాస్ ఆధ్వర్యంలో పెద్దాపురం మండల పరిధిలో దాడులు నిర్వహించి జె.తిమ్మాపురం గ్రామపరిధిలో 40 లీటర్ల సారాయి మరియు సారాయి కాపునకు సిద్ధంగా వున్న 1800 లీటర్ల బెల్లపు ఊటను స్వాధీన పరచుకొనడమైనది. నేరస్తులైన బత్తిన రమణ పిల్లి నాగరాజు వండ్లు నాగన్న పరారీలో ఉన్నారు. మరియు గండేపల్లి మండలం సుబ్బయమ్మపేటలో దాడులు జరిపి 20 లీటర్ల సారాయిని స్వాధీనపరచుకుని కర్రి మణి కంద్ర అను వ్యక్తిని అరెస్ట్ చేయడమైనది. సదరు కేసులో మరో నేరస్తుడు జెట్టి పెదనాగు పరారీలో ఉన్నాడు. ముద్దాయిని రిమాండ్‌కు పంపిచడమైనది. ఈ దాడుల్లో జె. విజయకుమార్ ఎస్.ఎం.సుభాని మరియు తదితర స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



కాకినాడ రూరల్ మండలం వలసపాకల గ్రామంలో బుధవారం కొండ్రు దుర్గాభవానికి సీఎం రిలీఫ్ ఫండ్ నుండి రూ.75000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న రాష్ట్ర వ్యవసాయ మరియు సహకార మంత్రివర్యులు కురసాల కన్నబాబు తండ్రి కురసాల సత్యనారాయణ.

## అప్పన్న వంటశాలకు నూతన సామగ్రి అందజేత



సింహాచలం: శ్రీ వరాహలక్ష్మీనరసింహస్వామి ఆలయ వంటశాలకు అధికారులు నూతన బాయిలర్స్‌ను ఈఓ ఎం.వెంకటేశ్వర్లు బుధవారం వంటశాల సిబ్బందికి అందజేశారు ఈ సామాగ్రిని వంటశాలలో అమర్చిన అనంతరం స్వామి వారికి భక్తులకు ప్రసాదంలు అందులో సిద్ధం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏ ఓ పులి రామారావు స్థానాచార్యులు టీపీ రాజగోపాల్ డీఈ మల్లేశ్వరరావు అర్చకులు సీతారామచార్యులు వంటశాల సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలను హింసిస్తున్న వారిని కఠినంగా శిక్షించాలి

*జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర సమత కన్వీనర్ రాధారాణి*

యస్.రాయవరం : నేటి సమాజంలో ప్రతి పది మంది ఆడపిల్లల్లో ముగ్గురు హింసకు గురవుతున్నారని, అటువంటి వాటికి కారణం అయిన వారిని అదుపులోకి తీసుకుని శిక్షించాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర సమత కన్వీనర్ రాధారాణి అన్నారు. స్థానిక బిసి బాలికల కళాశాల వసతి గృహంలో మహిళా హింసా వ్యతిరేక దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవంబరు 26 నుండి డిసెంబరు 10 వరకు మానవ హక్కుల దినోత్సవం, హింసా వ్యతిరేక దినోత్సవంలో భాగంగా ఈ సదస్సు నిర్వహిచారని చెప్పారు.ఆడపిల్ల గర్భంలో వివక్షకు గురవుతుందన్నారు. సమాజంలో మహిళలపై హింసకు, అత్యాచారాలకు పాల్పడుతున్నారని, ప్రతి ఒక్కరూ ఇటువంటి విషయాలను ప్రతిఘటించాలని కోరారు. మార్పు మన దగ్గర నుంచి మొదలు కావాలని ఆచరణలో మహి ళల సమస్యల పట్ల ఐక్యంగా కలిసి పరిష్కరించు కోవాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఐక్య రాజ్య సమితి వివరాల ప్రకారం ప్రతీ ముగ్గురిలో ఒకరు ఏదో ఒక హింసకు బలి అవుతున్నారన్నారు. సమాజంలో మార్పులపై వస్తున్న పరిస్థితులను చదువుతో పాటు ఆడపిల్లలు తమ భవిష్యత్తును తామే నిర్ణయించు కోవాలన్నారు. ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు ఎల్.గౌరి మాట్లాడుతూ హింసా వ్యతిరేక దినోత్సవాన్ని పలు చోట్ల జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు ఎన్‌విఎస్‌టిఐవి శర్మ, ఐద్వా జిల్లా నాయకులు కెవి.సూర్యప్రభ, కళాశాల వసతి గృహం మేట్రిన్ అంకంరెడ్డి గంగాభవానీ, కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

### విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ వారి ఆధ్వర్యంలో

## దివ్యాంగులకు జిల్లాస్థాయి ఆటల పోటీలు



విశాఖపట్నం: విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ వారి ఆధ్వర్యంలో జరిగిన దివ్యాంగులకు జిల్లాస్థాయి ఆటల పోటీలు బుధవారం పోలీస్ పేరేడ్‌గ్రౌండ్, సూర్యాబాగ్ నందు జాయింట్ కలెక్టర్-2 సూర్యకళ జాతీయ పతాకం ఎగురవేసి క్రీడల ప్రారంభోత్సవాన్ని ప్రకటించారు. అంధులు, శారీరక దివ్యాంగులు, బధిరులు, మానసిక దివ్యాంగుల విభాగాలలో దాదాపు 835మంది రన్నింగ్, షాట్‌పుట్, డిస్క్‌త్రో, లాంగ్ జంప్, చెస్, క్యారమ్స్, జావలిన్ త్రో మొదలగు క్రీడాంశాలలో వారి క్రీడా ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి సూర్యకళ మాట్లాడుతూ దివ్యాంగులలో దాగి ఉన్నటువంటి క్రీడాశక్తిని వెలికితీసి వారితో చైతన్యం నింపడానికి ఈ క్రీడలు తోడ్పడతాయని చెప్పారు. దాదాపు 20 సంస్థల నుండి వచ్చిన దివ్యాంగులను చూసి తాను చాలా ఆనందించానని చెబుతూ వారి అభివృద్ధికి ప్రభుత్వం ద్వారా తగిన సహాయం అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంనకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సహకరించారు. ఈ కార్యక్రమంలో పి.వెంకటేశ్వరరావు, పి.సంతోష్‌కుమార్, ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు. పాఠశాల క్రీడల ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎ.శేఖర్ ఆధ్వర్యంలో 25మంది వ్యాయామ ఉపాధ్యాయులు ఈ క్రీడల పోటీలు జరిపించారు. జిల్లాలో పనిచేస్తున్న 25 ప్రభుత్వ స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రభుత్వ అంధుల పాఠశాల, దివ్యాంగుల శిక్షణా కేంద్రం విద్యార్థులు, ప్రభుత్వ వసతి గృహాలు, పెందుర్తి మరియు విశాఖపట్నం, సమగ్ర శిక్ష అభియాన్ సాగుతున్న పాఠశాలలో చదువుచున్న దివ్యాంగులు పెద్దఎత్తున ఈ పోటీలలో పాల్గొన్నారు. దివ్యాంగుల సంక్షేమం కోసం పనిచేసే సంఘముల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వరాహా పుష్కరిణిలో వైభవంగా పోలిపాడ్యమి దీపోత్సవం



సింహాచలం : శ్రీవరాహ లక్ష్మీ నృసింహస్వామి వారి కొండ దిగువున వరహా పుష్కరణిలో పోలిపాడ్యమి దీపోత్సవం వైభవంగా జరిగింది. కార్తీక మాస ముగింపును పురస్కరించు కుని వరాహపుష్కరణిలో మహిళలు బుధవారం వేకువజామునుండి పోలినికి పూజలు నిర్వహించి దీపాలు వదిలారు. బ్రాహ్మ ణులకు వాయినాలు అందజేశారు. ముత్తయిదువులకు తాంబూలాలు ఇచ్చి పుచ్చుకున్నారు. మహిళలు అధిక సంఖ్యలో తరలి రావడం తో వరహాపుష్కరాని కిటకిటలాడింది. ఈ విధంగా చేయడం వలన పాపాలన్నీ తొలగిపోయి స్వర్గప్రాప్తి లభిస్తుందని విశ్వాసం. ఉత్సవం పురస్కరించుకుని పుష్కరిణీ ప్రాంతమంతా విద్యుత్ దీపాలతో అలంకరించగా పుష్కరిణీ ప్రాంగణ మంతా మహిళా భక్తులతో కిటకిటలాడింది. గోపాలపట్నం పోలీస్ వారు ఏటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా ట్రాఫిక్ నియంత్రణ చేపట్టి భక్తులకు అసౌకర్యం కలుగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

### మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా

## దివిస్ యాజమాన్యం శ్మశాన వాటిక నిర్మాణం



భీమునిపట్నం: భీమిలి మండలం అన్నవరం పంచాయతి లో ని ఎర్రయ్యపాలెం గ్రామంలో, మౌలిక సదుపాయాల కల్పన లో భాగంగా ఇరవై నాలుగు లక్షల రూపాయల వ్యయంతో శ్మశాన వాటిక దివిస్ యాజమాన్యం నిర్మించింది. బుధవారం శ్మశాన వాటిక లో ఉన్న శివుని విగ్రహంకు పూజ చేసి ప్రారంభించారు. దీనిలో దివిస్ సిబ్బంది మోహనరావు, నరసింహ, వెంకట్, మాజి సర్పంచి మైలపల్లి లక్ష్మణ రావు, ఎమ్.పి.టి.సి మైలపల్లి రామస్వామి, ఉప సర్పంచి లక్ష్మణరావు, వై యెస్ ఆర్ సి.పి. నాయకులు యెల్లాజి, సూరిబాబు, జనసేన నాయకులు అప్పారావు, గ్రామ పెద్దలు నూకరాజు పాల్గొన్నారు.

## లోకేశ్వరికి తల్లిదండ్రులకు బి-సెక్యూర్ ఫౌండేషన్ రూ.10వేలు ఆర్థిక సాయం



కోటవురట్ల : కోటవురట్ల మండలం బాపిరాజు కొత్తపల్లికి చెందిన లోకేశ్వరి పరిస్థితికి హైదరాబాద్‌కు చెందిన బి-సెక్యూర్ ఫౌండేషన్ సంస్థ స్పందించింది. ఆ బాలిక వైద్య ఖర్చులు కోసం 10 వేలు ఆర్థిక సాయం చెక్కు రూపంలో అందజేసింది. 2018 జూన్‌లో వరుసకు అన్నయ్య అయిన కామాంధుడి చేతిలో ఛిద్రమైన లోకేశ్వరి పరిస్థితి దయానీయంగా మారింది. ఈ పాప పరిస్థితిని నర్సీపట్నం ఐద్వా మహిళా నాయకులు లగుడు గౌరి, కె.సూర్యకళ వివిధ స్వచ్ఛంద సంస్థలకు తెలిపారు. సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. సోషల్ మీడి యాలో సమాచారం తెలుసుకున్న బి - సెక్యూర్ ఫౌండేషన్ స్పందించింది. ఆ అమ్మాయికి వైద్యం నిమిత్తం పది వేల రూపాయల చెక్కును హైదరాబాద్‌లోని అమీర్‌పేటకు చెందిన బి-సెక్యూర్ ఫౌండేషన్ సంస్థ అందజేసింది. ముక్కుపచ్చలారని లోకేశ్వరిపై అత్యాచారం జరిగిన సమయంలో పెనుగులాటలో మెడ నరాలు నలిగిపోయి జీవచ్ఛవంలా మారింది. డాక్టర్లు చేసేదేమీ లేక ఇంటికి తీసుకు వెళ్లిపొమన్నారు. బాధితురాలి తల్లిదండ్రులు పైల గణేష్, పైల లక్ష్మి వ్యవసాయ కూలీలు. వారికి ముగ్గురు ఆడ పిల్లలు. కామేశ్వరిని చూసుకునేందుకు తల్లి ఇంటి వద్దనే ఉండిపోగా తండ్రి కూలి పని చేసి కుటుంబాన్ని నెట్టు కొస్తున్నాడు. మందుల ఖర్చు ఎక్కువ అవుతుం డడంతో ఆపన్నహస్తం కోసం వారు ఎదురు చూస్తున్న వీరికి బి-సెక్యూర్ సంస్థ ఆర్థిక సాయాన్ని అందజేసింది. తల్లి పేరు మీద చెక్కును సిద్ధం చేసి తమ ప్రతినిధుల ద్వారా అందజేశారు. ఆర్థిక సాయం అందజేసిన బి-సెక్యూర్ ఫౌండేషన్ వారికి ఆ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

### శ్రీశైలం డ్యాంలో ప్లంగ్ పూలింగ్ పనుల పరిరక్షణకు

## కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలి

**కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన రాజ్యసభ సభ్యులు టి.సుబ్బరామిరెడ్డి**

విశాఖపట్నం : శ్రీశైలం డ్యాంలో ప్లంగ్ పూలింగ్ పనుల పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాజ్యసభ సభ్యులు టి.సుబ్బరామిరెడ్డి కోరారు. బుధవారం రాజ్యసభ జీరో అవర్‌లో టి.సుబ్బరామిరెడ్డి ఈ అంశాన్ని లేవనెత్తారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితిని పరిశీలించి వరల్డ్ బ్యాంక్స్ డ్యాం రీహాబిలిటేషన్ అండ్ ఇంప్రూవ్మెంట్ ప్రాజెక్ట్ 1 కింద సెంట్రల్ వాటర్ కమిషను ప్లంగ్ పూల్ పనులు అప్పగించే విధంగా చర్యలు చేపట్టాలని కేంద్ర జలశక్తి మంత్రిని టిఎస్సార్ కోరారు. కొన్నేళ్లగా శ్రీశైలం డ్యాంలో దెబ్బతిన్న చోట మరమ్మ త్తులు, నిర్వహణ పనులు తక్షణమే చేపట్టాల్సిన ఆవశ్యకతను టిఎస్సార్ తెలియజేశారు. ఇటీవల రిజ ర్వాయర్‌ను సందర్శించిన నిపుణులు శ్రీశైలం డ్యాం నిర్వహణకు తగిన సిబ్బంది, నిధుల అవసరాన్ని తెలియజేశారని, వారి అంచనా మేరకు డ్యాంకు ఇరువైపులా దెబ్బతినే పరిస్థితులను నివారించేందుకు దాదాపు రూ.60 కోట్లు అవసరముందని తెలియజేసినట్లు పేర్కొ న్నారు. ఈ అంశానికి ప్రాధాన్య తను ఇచ్చి పనులు చేపట్టాలని టిఎస్సార్ కోరారు.

## డిసెంబర్ 8న శ్రీ మద్భగవద్గీతా శ్లోకాల కంఠస్థ పోటీలు

పెద్దాపురం : పెద్దాపురంలో డిసెంబర్ 8 వ తేదీన శ్రీ మద్భగవద్గీతా శ్లోకాల కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు శ్రీ హరి శంకరాచార్య వేద శాస్త్ర ట్రస్ట్ అధ్యక్షులు చిట్టెం హరగోపాల శర్మ అవధాని తెలిపారు.భగవద్గీత 14 వ అధ్యాయము (గుణ త్రయ విభాగ యోగం)కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.జూనియర్ విభాగం 1వ తరగతి నుండి 7వ తరగతి వరకు,సీనియర్ విభాగం 8వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు, 5 సంవత్సరాల నుండి 16 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులు మాత్రమే పాల్గొనాలని తెలిపారు. పోటీలో పాల్గొనదలచిన వారు 07-12-2019లోగా డి.వి శర్మ(9396224463) శ్రీరాం ప్రకాష్ (9397900447)దగ్గర పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ పోటీలు పెద్దాపురం శివాలయం వీధిలో గల లెమ్స్ స్కూలు నందు జరుగుతాయని హరగోపాల శర్మ తెలిపారు.

## ప్రాంగణ ఎంపికల్లో ఆదిత్య విద్యార్థుల హవా



విశాఖపట్నం : స్థానిక గోపాలపట్నం ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు నవంబరు 22, 23 తేదీలలో మహరాజ విజయ గజపతి రాజు (ఎమ్.వి.జి.ఆర్) ఇంజనీరింగ్ కళాశాలలో ఎ.పి.ఎస్.ఎస్.డి.సి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇన్ఫోసిస్ ఐ.టి కంపెనీ వారి ప్రాంగణ ఎంపికల్లో ఆదిత్య డిగ్రీ కళాశాల గోపాలపట్నం విద్యార్థులు 59 మంది ఆపరేషన్స్ ఎగ్జిక్యేటివ్ పర్సన్స్‌గా ఎంపికయ్యారు.

వీరికి ఏడాదికి రెండు లక్షల నలభై వేలు జీతం ఉంటుంది. ఎంపిక అయిన విద్యార్థులకు ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సతీష్, సింహాచలం, వైస్ ప్రిన్సిపాల్ డి.వి.వి.ఫణి కుమార్, షాహిద్ ఆలి మరియు అధ్యా పకుల సహాయ సహకారాలతో స్పెషల్ ట్రైనింగ్ క్లాస్లను నిర్వహించి వారి విజయానికి కారకుల య్యారు. ఈ ఎంపికకు విజయనగరం, విశాఖ పట్నం, శ్రీకాకుళం జిల్లాల నుండి విచ్చేసిన వివిధ కళా శాలల విద్యార్థులు సుమారు 1,700 మంది హాజ రయ్యారు. ఇంతటి ఘన విజయాన్ని సాధించిన సదరు విద్యార్థులను సెక్రటరీ ఎన్.కృష్ణ దీపక్‌రెడ్డి, కోఆర్డినేటర్ బి.ఇ.వి.యల్. నాయుడు, ప్రిన్సిపాల్ కె.మురళీమోహన్‌రావు అభినందించారు.

## భక్తి శ్రద్ధలతో పోలి పాడ్యమి పూజలు



సబ్బవరం : కార్తీక మాసం ఆఖరి రోజు మార్గశిరమాసం పోలి పాడ్యమికి పలు శివాల యాల్లో బుధవారం భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు జరిగాయి. కార్తీక మాసం చివరిరోజున పోలి స్వర్గంగా వ్యవహరిస్తారు. హరిహరులకు ఇష్టమైన కార్తీక మాసం ఎన్నో రకాలుగా విశిష్టమైనది. ఈ మాసం ముగింపు సందర్భంగా వత్తులతో దీపాలను ఉసిరికాయలపై బియ్యం పిండితో చేసిన దీపాలను ఆ దీపాలను వెలిగించడం సంప్రదాయకరంగా వస్తుంది.

ఈ రోజున అత్యధికంగా మహిళలు ప్రాత:కాలంలో నిద్ర లేచి చెరువుల్లో, కోనేరులో, గెడ్డల్లో దీపాలను వెలిగించి నీటిలో వదిలారు. కార్తీక మాసంలో ఏ రోజు దీపాన్ని వెలిగించక పోయినా ఈ రోజున 30 వత్తులతో దీపం వెలిగించి నీటిలో వదిలితే ఈ మాసమంతా చేసినంత పుణ్యం వస్తుందని తెలిపారు. అత్యధిక సంఖ్య మహిళలు పూజలు చేశారు.

## తగరపువలస మార్కెట్ వద్ద సిఐటియు రాస్తారోకో

భీమునిపట్నం: తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీని ప్రభుత్వ పరం చెయాలని ప్రవేటీకరణ మానుకోవాలని నలబై రెండు వేల మంది కార్మికులు దాదాపు ఏబై రోజులు పైబడి పోరాటం చేస్తూ వుంటే కనీసం పట్టించు కోలేదు కదా పనిచేస్తున్న నలబై రెండు వేల మంది కార్మికులు తొలగించడం అన్యాయమని కార్మికులకు సమ్మె హక్కును కాలరాయడ మేనని దీనిని ప్రజలంతా ఖండించాలని, నలభై రెండు వేల మంది కార్మికులను దేశ మంతా బాసలు గా నిలవాలని సిఐటియు మండల వైస్ ప్రెసిడెంట్ రవ్వ నరసింగ రావు డిమాండ్ చేశారు.బుదవారం సాయంత్రం సిఐటియు ఆద్వర్యంలో తెలంగాణ ఆర్‌టిసి కార్మికులను సంఘీభావంగా భీమిలి మండల కమిటీ ఆద్వర్యంలో తగరపువలస మార్కెట్ వద్ద రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా నరిసింగ రావు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం కార్మికులపై అన్యాయం ఒడిగట్టిందని, దీనికి రానున్న కాలం లో మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రీసు నర్సింగరావు,కొత్తయ్య రెడ్డి, ఇంటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ రుణాలకు బారులు తీరిన అభ్యర్థులు



గొలుగొండ : గొలుగొండ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపిడిఓ డేవిడ్‌రాజు, ఈవోపిఆర్‌డి ప్రభాకరరావు, బ్యాంక్ మేనేజర్లు రుణాల కోసం ఇంటర్వ్యూలను నిర్వహించారు. బుధవారం బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఏడిబి నర్సీపట్నం, యూనియన్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్ పరిధిలో ఆన్‌లైన్ చేసుకున్న లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు అభ్యర్థులు భారీ ఎత్తున రావడంతో కార్యాలయం అభ్యర్థులతో నిండిపోయింది.

## ఇల్లు కొరకు గతంలో డిడిలు కట్టినవారు ఆందోళన చెందవద్దు

**- వైకాపా ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు**



సీతమ్మధార : విశాఖ ఉత్తర నియోజక వర్గంలో ఇల్లుకోసం దరఖాస్తు చేసుకున్న వారికి అర్హత ఉన్న ప్రతిఒక్కరికి ఇల్లు మంజూరు చేయించే బాధ్యత మాది గతంలో ఇల్లు కోసం డి.డి.చెల్లించనవారు, ప్రొసీడింగ్ ఆర్డర్ తీసుకున్నవారు కూడా ఎవ్వరు ఆందోళన చెంద వలిసిన అవసరంలేదని విశాఖ ఉత్తర నియో జకవర్గ సమన్వయ కర్త కె.కె.రాజు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఇల్లు లేని ప్రతి పేద వారికి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇల్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.60గజాల స్థలం ఉన్న ప్రతి ఒక్కరు ఇల్లు నిర్మాణం చేయడానికి సిద్ధంగా ఉన్నట్లయితే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో పోలి పాడ్యమి వేడుకలు



కంచరపాలెం : జివియంసి 40 వ వార్డు పరిధి సాయి నగర్ వద్ద వెలసిన శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో పోలి పాడ్యమిని పురస్కరించుకొని బుధవారం వేకువ జాము నుంచి పెద్ద సంఖ్యలో భక్తులుహాజరై ఆలయ ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన కోనేరు లో దీపాలను వెలిగించి వారి భక్తిని చాటుకున్నారు. ముందుగా ఆల యంలో కొలువై ఉన్న శివ పార్వతుల స్వామి అమ్మ వారు లను దర్శించుకొని ఆలయ ప్రధాన అర్చకులు అందు కురి శివాజి శర్మ వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో బాగంగా మధ్యాహ్నం భక్తులకు భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వ హించారు. కార్యక్రమాన్ని దేవదాయ-ధర్మదాయ కార్యనిర్వహణాధి కారి బి.ప్రసాదరావు పర్యవేక్షించారు.

## శివాలయం వద్ద భారీ అన్నదాన కార్యక్రమం

**- అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పర్వత**





అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరం స్దానిక పంపా ప్రాజెక్టు దిగువ భాగమున గల బంగారు కోనేరులో వెలసిన శ్రీ గంగా పార్వతీ సమేత భూలోకేశ్వర స్వామివారి ఆలయం నందు కార్తీకమాసము నెల రోజులు ప్రత్యేక పూజలు, అభిషేకములు నిర్వహించారు. కార్తీకమాసము చివరి రోజైన పాడ్యమిని పురష్కరించుకొని ఆలయ కమిటీ సభ్యులు బుధవారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ముందుగా ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత.పూర్ణచంద్ర ప్రసాద్ శ్రీ స్వామివార్ని దర్శించుకొని శ్రీ స్వామివారి తీర్థ ప్రసాదములు స్వీకరించారు. అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్థులు ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొని శ్రీ స్వామివారి ప్రసాదమును స్వీకరించారు.

## ఇకపై డీలర్లు వద్దే వాహనాల హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్స్

**రవాణాశాఖ ఉపకమిషనర్ రాజారత్నం**



విశాఖపట్నం: రవాణా శాఖ కమిషనర్, ఆంధ్రప్రదేశ్ వారి ఆదేశాలు ప్రకారం ఇకపై డీలర్లు వద్దే వాహనాల హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్స్ బిగించుకోవాలని తెలియజేయడమైనది. బుధవారం మాధవధార ఆర్టీఏ కార్యాలయంలో డీలర్లుతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా భారత ప్రభుత్వం ఆదేశాలు ప్రకారం ప్రతి యొక్క వాహన దారుడు తమ వాహనానికి హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్స్ డీలర్లు వద్ద బిగించేల చర్యలు తీసుకొని, అంతే కాకుండా హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్స్ ధరలను కూడా వాహన దరలలో కలిపి వసూలు చేయవలెను. ఎక్కువ ధరలను వసూలు చేయరాదు. డీలర్లు వాహనాలకు హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్స్ బిగించి వాహనాన్ని వాహన దారుడుకి అందచేయవలెను. ఈ నిబందనలు ఉల్లం ఘించిన డీలర్లు మరియు వాహన దారులకు రూ.50,000 లు విధించబడునని తెలియజేయదమయినది. ఈ కార్యక్రమంలో డి.టి.సి. రాజ రత్నం, ఆర్టీవోస్ ఎస్. పూర్ణ చంద్రరావు, అబ్దుల్ రవూఫ్, ఏవో ఫహీం, ఎంవిఐ కె.వి.ప్రకాశరావు మరియు డీలర్లు పాల్గొన్నారు.

## ఘనంగా కార్తీక దీపారాధన



భీమునిపట్నం : భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీ గ్రామ పెద్దలు సహాకారముతో కార్తీక మాసము చివర రోజున కార్తీక దీపారాధన కార్యక్రమము విజయవంతం గా జరిగింది. శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయము, గొల్లవీధి వేప చెట్టు దగ్గర పుష్కర ఘాట్ వద్ద గోస్తని నదీ తీరంన దివీస్ సంస్థ ఏర్పాటు చేసిన పుష్కర ఘాట్ వద్ద భక్తులు తాకిడి తో గోస్తనీ ప్రాంతం అంత కార్తీక దీపాలు కాంతులతో శోభ ను సంతరించుకుందని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా గ్రామ పెద్దలు,యూత్ కమిటీ,అభయ ఆంజనేయ స్వామి అయ్యప్ప స్వామి పీఠం వారు అన్ని ఏర్పాట్లు చేశారు. తగరపువలస మరియు దూర ప్రాంతము నుంచి వచ్చిన భక్తులు ఈ ఏర్పాటును చూసి హర్షం వ్యక్తం చేశారు. అలాగే భీమిలి జోనల్ కార్యాలయం ఎదురుగా గోస్తనీ నధీ సంఘం దగ్గర భక్తులు తెల్లవారి రెండు నుంచి ఉదయం వరకు భక్తులు అధిక వచ్చి కార్తీక దీపాలు సముద్రం ఒడ్డున వెలిగించారు. జోనల్ కారా లయ సిబ్బంది భక్తులు ఇబ్బంది పడకుండా ఎల్ఇడి లైట్లు ఏర్పాటు చేశారు.

## అంతకాపల్లిలో ఘనంగా అయ్యప్ప స్వామి ఇరుముడి మహోత్సవం



సబ్బవరం : మండలంలోని అంతకాపల్లి గ్రామంలో శ్రీ కోదండ సీతారామాలయంలో బుధవారం ఘనంగా అయ్యప్ప స్వామి ఇరుముడి మహోత్సవం జరిగింది. అంతకాపల్లి గ్రామంలో స్వాముల మాలాధారణ వేసి శబరిమలై వాసుడు మణికంతుని దర్శనం కోసం మాలలు కార్తీక మాసంలో ధరించి ఉదయం, సాయంత్రం చన్నీటి స్నానం చేసి శరణ ఘోషలతో భజనలతో స్వామిని పూజిస్తూ 41 రోజుల పాటు కఠిన దీక్షలు చేసి ఇరుముడి కట్టి శబరియాత్ర చేస్తారు. ఇరుముడిలో ప్రధానమైనది నెయ్యితో నింపిన టెంకాయ, అయ్యప్ప స్వామి నెయ్యి అభిషేక ప్రియుడని, కర్పూర ప్రియుడని అంటారు. అందుకే నేతితో నింపిన కొబ్బరికాయ ఇరు ముడితో శబరియాత్ర చేస్తారు. ఈ కార్యక్రమంలో పి.రమేష్, గొర్లి ఎర్రి నాయుడు, గొర్లి అప్పారావు, జి.హృదయ భాస్కర్, గొర్లి శ్రీనువాస రావు, మిడతాడ జోగినాయుడు, లాలం సంతోష్, పి భాస్కర్‌రావు, ఏ.ప్రసాద్, ఎ.రాజు, లాలం అచ్చెంనాయుడు, వనం రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ నూకాంబిక అమ్మవారి

## ఆలయ నిర్మాణానికి ఒకలక్షా 9వేలు విరాళం



సబ్బవరం : మండల కేంద్రంలోని సబ్బవరం మేజర్ పంచాయితీలోని పెదనాయుడుపాలెం భక్తులకు కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతున్న శ్రీ నూకాంబికా అమ్మవారి ఆలయ పున: నిర్మాణం చేపడుతున్న ఆలయానికి టిడిపి సీనియర్ నాయకులు బాలాజీ డవలపర్స్ పి.బి.వి.ఎస్.ఎన్. రాజు (బుచ్చి రాజు) ఒకలక్షా 9వేలు రూపాయలు బుధవారం శ్రీ నూకాంబికా ఆలయ కమిటీ నిర్వాహకులు రెడ్డి దేముడు బాబు, బర్ల రమణ, సబ్బవరపు నాగేంద్రకుమార్, వెన్నల అప్పల నాయుడులకు అందజేశారు. అలాగే గొటివాడ చిరంజీవి (బ్యాంక్ రాజు) ఆలయ నిర్మాణానికి 50వేల రూపా యలు కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వెంకటరమణ, రేజేటి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## 2021 నాటికి వియంఆర్‌డిఏ బృహత్తర ప్రణాళిక

**మొదటి పేజీ తరువాయి**




ప్రాంతాల్లో అనేక వనరులు, ప్రకృతి ప్రాంతాలు ఉన్నాయని పర్యాటకంగాను అవకాశాలు అధి కంగా ఉన్నాయని చెప్పారు. రవా ణా రంగాన్ని అనుసంధానం చేయడం ప్రధాన అంశంగా చేర్చాలని అన్నారు. బి.ఆర్.టి.ఎస్ వంటి రహదారులు రావలసిన అవసరం ఉందని చెప్పారు. వ్యవసాయ రంగాన్ని విస్మరించ కుండా తగు ప్రాధాన్యతను కల్పించి పర్యావరణ పరిరక్షణకు పెద్ద పీఠ వేస్తూ పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయు టకు చర్యలు చేపట్టాలన్నారు. పర్యాటక సర్క్యూట్ లను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. శ్రీకాకుళం వంటి ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజి వ్యవస్థ అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని, హెరిటేజ్, టెంపుల్ టూరిజం వంటి అంశాలకు ప్రాధాన్యతను ఇవ్వాలని అన్నారు.

వియంఆర్డిఏ చైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ దృక్పథ, మాస్టర్ ప్రణాళికలు రూపొందించుటకు చర్యలు చేపట్టామన్నారు. బృహత్తర ప్రణాళికలు జనవరి నాటికి, మాస్టర్ ప్లాన్ జూన్ నాటికి తయారీకి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. 2021 సంవత్సరం నాటికి ప్రణాళికలు అమలుకు యోచిస్తున్నామని చెప్పారు. శ్రీకాకుళం వరకు విస్తరణ చేయుటకు చర్యలు చేపడుతున్నామని అన్నారు. సిఆర్డిఏ తరువాత వియంఆర్డిఏ పెద్ద నగరాభివృద్ధి సంస్థ అన్నారు. శ్రీకాకుళం గేట్ వే లాంటిదని ఉత్తరాంధ్ర ప్రాంతాలకు, ఒడిషాకు ప్రధాన ద్వారంలా ఉందని అన్నారు. అభివృద్ధికి అవకాశాలు ఎక్కువగా ఉన్న ప్రాంతం అన్నారు. పర్యాటక, ఉత్పాదక రంగాలలో అవకాశాలు ఉన్నాయని చెప్పారు.

జిల్లా కలెక్టర్ జె నివాస్ మాట్లాడుతూ బుడగట్ల పాలెం వద్ద ఫిషింగ్ జెట్టి నిర్మాణానికి ప్రతిపాదనలు వున్నాయన్నారు. డి.పి.ఆర్ లు సైతం సమర్పించడం జరిగిందన్నారు. జిల్లాలో రహదారుల అనుసంధానం అవసరం అన్నారు. వాటర్ రిజర్వాయర్ లు ఏర్పాటు చేయాలని తద్వారా నీటి నిల్వ చేసి భవిష్యత్ అవసరాలకు ఉపయోగించవచ్చని సూచించారు.

రాజాం శాసన సభ్యులు కంబాల జోగులు మాట్లాడుతూ రాజాంలో బై పాస్ రహదారి అవసరమన్నారు. రాజాంను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని సూచించారు.

లియ అసోసియేట్స్ సౌత్ ఆసియ ప్రైవేట్ లిమిటెడ్ కాన్సులెటెన్సీ ప్రతినిధి రమేష్ బృహత్తర ప్రణాళికను వివరించారు. 20 సంవత్సరాల మాస్టర్ ప్లాన్ తయారు చేస్తున్నామని, 5837 చదరపు కి.మీ. ప్రాంతం వి.ఎం.ఆర్.డి.ఏ ఉందన్నారు. అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయడం అవసరమన్నారు. బృహత్తర ప్రణాళికలను తయారు చేయుటకు 3 జిల్లాల్లో సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్య, వైద్యం, పర్యాటక, తయారీ, ఐటి, ఆర్థిక తదితర రంగాల్లో అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని వాటిని బృహత్తర ప్రణాళికలో పొందుపరుచడం జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర విభజన అనంతరం విశాఖపట్నం ప్రాంతానికి ప్రాధాన్యత పెరిగిందని చెప్పారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, భావనపాడు, కళింగపట్నంలలో గ్రీన్ ఫీల్డ్ పోర్టులు రాబోతున్నాయని చెప్పారు. కోస్టల్ కారిడార్ కు ప్రతిపాదనలు ఉన్నాయని చెప్పారు. శ్రీకాకుళం జిల్లాలో 11 మండలాలు వియంఆర్డిఏ పరిధిలో ఉన్నాయని వివరించారు. ఎకనామిక్ గ్రోత్ స్ట్రాటజీ తో ప్రణాళికలు చేపడుతున్నామని చెప్పారు.

ఈ సందర్భంగా శాసన సభాపతి తమ్మినేని సీతారాంకు, శాసన సభ్యులు జోగులుకు వియంఆర్డిఏ చైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస్ దుస్సాలువతో సత్కరించారు. వియంఆర్డిఏ చీఫ్ అర్బన్ ప్లానర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఛారిటబుల్ ట్రస్ట్ బాలలకు అల్పాహారం అందజేత

భీమునిపట్నం : తగరపువలస స్థానిక వ్యాపారస్తులు,డిసిఆర్ సేవారథం దాత దుర్గాశేఖర్ పుట్టినరోజు సందర్భంగా వారి వద్ద పనిచేసే సిబ్బంది మన కుటుంబం చారిటబుల్ ట్రస్ట్ బాలల సంరక్షణ కేంద్రం పిల్లలకు అల్పాహారం అందించారని సంస్థ ఇన్ ఛార్జ్ వెంపాడ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈరోజుల్లో ఎవరైన యజమాని పుట్టినరోజు అయితే ఆవ్యక్తికి గిఫ్ట్ ఇస్తారు. కాని అందరూ తన యజమాని పుట్టినరోజు సందర్భంగా ఈ పిల్లలకు అల్పాహారం ఇచ్చారని తెలిపారు. అందుకు వారికి ధన్యవాదాలు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

అంతే కాకుండా దుర్గా శేఖర్ మొట్టమొదటి సారిగా హోమ్ కు రావడం సంతోషంగా ఉందని అన్నారు. ఆయనను మన కుటుంబం హోం బాలలు సత్కరించి, ఒక పూలమొక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో వారి స్టాఫ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## మీటర్ రీడర్లకు పీస్‌రేటు విధానం రద్దు చేయాలి

**సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు నర్సింగరావు**




విశాఖపట్నం: విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న మీటర్ రీడర్లకు పీస్‌రేటు విధానం రద్దు చేసి కార్మికులకు కనీసవేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మీటర్ రీడర్ కార్మికులను తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ నేడు ఛలో విజయవాడ కార్యక్రమం చేపట్టారు. విజయవాడ సభలో నర్సింగరావు పాల్గొని మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.1.26 లక్షల సచివాలయ ఉద్యోగాలు కల్పించడం హర్షించదగ్గ విషయమే కానీ దాని స్థానాల్లో పనిచేసే మీటర్ రీడర్ల కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. విద్యుత్ సంస్థల్లో అత్యధిక మంది కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికు లుగా పనిచేస్తున్నారు. వీరందర్నీ రెగ్యులరైజ్ చేస్తామని జగన్ చెప్పడంతో చాలా సంతోషించి గెలిపించితే నేడు వారికి ఉద్యోగ భద్రత లేకుండా చేశారని విమర్శిం చారు. మీటర్ రీడర్లకు ఇప్పటివరకు కార్మిక చట్టాలు వర్తింపజేయకుండా పీస్‌రేటు విధానం ద్వారా కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారన్నారు. పీస్‌రేటు విధానం రద్దు చేసి వీరికి తక్షణమే కనీస వేతనాలు, ఇఎస్ఐ, పిఎఫ్ వంటి కార్మిక చట్టాలు అమలు చేయా లన్నారు. ఉద్యోగం నుండి తొలగించిన వారిని తక్షణమే వేసుకుని ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

విజయవాడలో జరిగిన సదస్సుకు విశాఖజిల్లానుండి వందలాది మంది కార్మికులు తరలివెళ్ళారని యూనియన్ గౌరవాధ్యక్షులు ఆర్.కె.ఎస్.కుమార్ తెలిపారు.

## తాణాంలో భూసార పరీక్షకార్డులు పంపిణీ

ముఖ్యఅతిథిగా మాజీ ఎఫ్ సిఐ మెంబర్ పి.యస్ రాజు హాజరు



పరవాడ: పరవాడ మండలము తాణాం గ్రామంలో బుధవారము భూసారపరీక్షలు పరవాడ వ్యవసాయ అధికారిణి చంద్రావతి అద్వర్యంలో నిర్వహించారు. అనంతరము రైతులుకు భూసార పరీక్షి కార్డులు మరియు ఎరువులును పంపిణీ చేసారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ అహరభద్రత సలహ మండలి సభ్యులు పైల సన్యాశిరాజు హజరై అయన చేతులు మీదగా పంపిణీ చేసారు.వ్యవసాయ అదికారణి చంద్రావతి మాట్లడుతూ తాణాం గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు క్రింద ఎంపికచేసామనీ తెలిపారు.భూసారపరీక్షలు 20192020 సంవత్సరము క్రింద ఎప్రియల్ నెలలో చేయడము జరిగిందనీ తెలిపారు.భూసార పరీక్షి ప్రకారము ఎరువులును పంపిణీ చేసామనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తారణా అదికారులు సంజీవరావు,వరలక్ష్మి మరియు సచివాలయం సిబ్బంది తథితర్లు పొల్గోన్నారు.

## ముగిసిన అఖండ భజన

చీడికాడ : మండలంలోని కేజీపురం గ్రామంలో ఆగస్టు 11వ తేదీన ప్రారంభమైన హారేరామ భజన మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అఖండ భజన బుధవారం నాటికి 108పూర్తి రోజులు కావడంతో మంగళ హారతి ఏర్పాటు చేసి లక్ష వత్తుల దీపం వెలిగించి హారేరామ అంటూ అఖండ భజన కార్యక్రమం ముగించారు. ఈ కార్యక్రమంలో హారేరామ భజన మండలి సభ్యులు మాట్లాడుతూ ఈ అఖండ భజన కార్యక్రమానికి కేజేపు రం గ్రామస్తులు వేలాది రూపాయలు విరాళాలు అం దించడంతో పాటు సహాయ సహకారాలు అందిం చారని అన్నారు. ఈ అఖండ భజనకు మాడుగుల శాసన సభ్యులు బూడి ముత్యాలనాయుడు చోడవరం శాసన సభ్యులు కరణం ధర్మశ్రీ , మాజీ శాసన సభ్యులు గవిరెడ్డి రామానాయుడు,, పాలకుర్తి మోహ నరావు , భీశెట్టి అచ్చియం కాళ్ల సూరిబాబు విరాళాలు అందించారని తెలిపారు. అఖండ భజన ముగింపు సందర్భంగా భారీ అన్నసమారాధన, ఎడ్ల పందాలు ఏర్పాటు చేయడం జరిగిందని భజన మండలి నిర్వాహకులు తెలిపారు.

## ముమ్మిడివరం జోన్ ఉత్కంఠగా సాగుతున్న బాస్కెట్ బాల్ టోర్నీ

యానాం: యానాంలోని డాక్టర్ వైఎస్సార్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియంలో గత రెండు రోజులుగా జరుగుతున్న 65వ అండర్-19 జాతీయ బాస్కెట్ బాల్ పోటీలు ఉత్కంఠగా సాగుతున్నాయి. రెండవ రోజు 18 జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. మొదటి మ్యాచ్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణా జట్ల మధ్య పోరు నువ్వా, నేనా అన్నట్లు సాగింది. అయితే చివరికి తెలంగాణా జట్టు విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్-85 పాయింట్లు సాధించగా, తెలంగాణా-88 పాయింట్లు సాధించి విజయం సాధించింది. అదేవిధంగా ఉత్తరాఖండ్-54, గోవా-28 పాయింట్లు సాధించగా ఉత్తరాఖండ్ విజయం సాధించింది. విద్యాభారతి-60, డిఎవి-48 పాయింట్లు సాధించగా విద్యాభారతి సాధించింది. రాజస్థాన్-51.బీహార్-15 పాయింట్లు సాధించగా రాజస్థాన్ గెలిచింది. హోరాహోరీగా సాగిన మ్యాచ్ లో ఛత్తీషర్-51. ఐపిఎస్ సి-53 పాయింట్లు సాధించగా ఛత్తీస్ ఘర్ విజయం సాధించింది. ఉత్తరపదేశ్ -64. నవోదయ విద్యాలయ-30పాయింట్లు సాధించగా ఉత్తరప్రదేశ్ విజయం సాధించింది. తమిళనాడు-85. మధ్యప్రదేశ్-64 పాయింట్లు సాధించగా తమిళనాడు విజయం సాధించింది. కర్ణాటక-53. హర్యానా-78 పాయింట్లు సాధించగా హర్యానా జట్టు విజయం సాధించింది. అదేవిధంగా ఆఖరి మ్యాచ్ లో గుజరాత్-11. మహారాష్ట్ర-66 స్కోర్ సాధించి విజయం సాధించింది.

## బాబు నోటికొచ్చినట్లు మాట్లాడితే బుద్ధి చెప్తాం



అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఏ మొహం పెట్టుకుని రాజధానిలో తిరుగుతారని పౌర సరఫరాల శాఖ మంత్రి కొడాలి నాని విమర్శించారు. ఇకనైనా చంద్రబాబు రాజధానిలో డ్రామాలు కట్టిపెట్టాలని సూచించారు. ఆయన బుధవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. మంగళగిరి, తాడికొండలలో టీడీపీ ఓడిపోయినా చంద్రబాబుకి సిగ్గు లేదు. పైగా మాపైకి కుక్కలను పంపి తిట్టిస్తున్నారు. మేము చంద్రబాబు భార్య, తల్లి, అక్కపై విమర్శలు చేయలేదు. కానీ బాబు మా కుటుంబ సభ్యులపై విమర్శలు చేయిస్తున్నారు. మేము తిట్టిస్తే ఇంతకన్నా దారుణంగా ఉంటుంది. చంద్రబాబు వ్యక్తిగతంగా నన్ను, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి బొత్స సత్యనారాయణను దూషిస్తున్నారు. బాబు నోటికొచ్చినట్టు మాట్లాడితే తగిన బుద్ధి చెప్తామని మంత్రి హెచ్చరించారు.

## అగ్నిమాపక బాధితులకు ఆర్దిక సహాయం అందజేస్తున్న రేపాక వీర్రాజు



అన్నవరం: తూ.గో.జిల్లా అన్నవరం స్దానిక రిజన్ చెరుపు గట్టు మీద ఉన్న పూరి గుడిసెలు ఇటీవల కరెంటు షార్ట్ సర్క్యూట్ వలన నాలుగు ఇల్లు పూర్తిగా అగ్నికి ఆహుతై సర్వం కోల్పోయిన వారికి తన వంతు సహాయముగా శ్రీ సత్యదేవ స్వచ్ఛంద సంస్ద అధ్యక్షుడు రేపాక.వీర్రాజు తన కుటుంబ సభ్యులతో కలసి తమ వంతు ఆర్దిక సహాయముగా సంస్ద తరపున కొంత నగదును పంపిణీ చేసారు.ఈ కార్యక్రమంలో పదిలం.బెన్న బాబు,రేపాక.లీల,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల అభివృద్దే సీఎం జగన్ మోహన్ రెడ్డి ద్యేయం ఎమ్మెల్యే యు వి రమణమూర్తి రాజు



అచ్యుతాపురం : మత్స్యకారుల అభివృద్దే సీఎం జగన్ మోహన్ రెడ్డి ద్యేయమని యలమంచిలి ఎమ్మెల్యే యు వి రమణమూర్తి రాజు ( కన్నబాబురాజు ) అన్నారు. బుధవారం మండల కార్యలయంలో ఎమ్మెల్యే బోటు గల మత్స్యకారులకు డీజిల్ సబ్సిడి కార్డులను పంపిణి చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం డీజిల్ సబ్సిడీని రూ .9 పెంచారని , మత్స్యకారులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు .ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా రూరల్ యువజన అధ్యక్షులు లాలం రాంబాబు, ఎంపీడీఓ నిర్మలాదేవి, మత్స్యశాఖాధికారిని, వైసిపి నాయకులు పిన్నంరాజు వాసు,కోన బుజ్జి ,వాసుపల్లి శ్రీనివాసరావు, మత్స్యకారులు ఉన్నారు.

## ప్రతిభా అవార్డు దరఖాస్తుల ఆహ్వానం




కాకినాడ : ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పలురంగాల్లో స్ఫూర్తి దాయకం గా నిలిచే వ్యక్తులు, చిన్నారులకు భారత తెలుగు సాంస్కృతిక సంస్థ అవార్డులు ప్రదానం చేయనుందని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సంస్థ వ్యవస్థాపక జాతీయ కార్యదర్శి డా. గణగళ్ల విజయ్ కుమార్ తెలిపారు. కాకినాడ దంటు కళాక్షేత్రం లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.భారతీయ సంప్రదాయ కళలు, విద్య, వైద్యం, సమాజాసేవ, విధినిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, న ృత్యం, సంగీతం, సాహిత్యం, క్రీడలు, ఉపాధికల్పన తదితర రంగాల్లో ప్రతిభ చాటిన వారికి 2020 జనవరి 5 న హైదరాబాద్ లో అవార్డుల ప్రదానం ప్రముఖుల సమక్షంలో జరుగుతుందని తెలిపారు. అర్హులైన వారు డిసెంబర్ 22 లోగా తమ దరఖాస్తులను అమ ృత కోర్ట్ అపార్ట్మెంట్, పిహెచ్2 ,డోర్ నెం - 30 - 8 - 29/25, భాను స్ట్రీట్, డాబా గార్డెన్స్, విశాఖపట్నం -20. చిరునామా కు పంపించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 77805 89775ఫోన్ నెంబర్ లో సంప్రదించాలని అన్నారు. ప్రతిభా నిరూపణ పత్రాలు, రెండు పాస్పోర్ట్ ఫోటోలు, జాతచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాకారులు తురగా సూర్యారావు, ముంజులూరు విశ్వేశ్వరావు, డా.వేదుల శ్రీరామ శర్మ( శిరీష ),పెంటపాటి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మరోసారి కన్నీటి పర్యంతమైన మాజీ సీఎం...



బెంగళూరు : కర్ణాటక మాజీ సీఎం, జేడీఎస్ నేత కుమారస్వామి మరోసారి కన్నీటి పర్యంతం అయ్యారు. మండ్యా జిల్లాలో ఉప ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న ఆయన ఉద్వేగానికి లోనయ్యారు. వివరాల్లోకి వెళితే.. కర్ణాటకలోని 15 అసెంబ్లీ స్థానాలకు డిసెంబర్ 5వ తేదీన ఉప ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పార్టీలు తమ ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. మండ్యా జిల్లాలోని కృష్ణరాజపేటె అసెంబ్లీ నియోజకవర్గంలో బీఎస్పీ అభ్యర్థి బీఎల్ దేవరాజ్ తరపున కుమారస్వామి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నా కుమారుడిని ఎన్నికల బరిలో నిలపాలని అనుకోలేదు. మండ్యా ప్రజలే అతన్ని ఎన్నికల్లో నిలపమని కోరారు.. కానీ వారే అతనికి మద్దతు ఇవ్వలేదు.. ఇది నన్ను చాలా బాధించింది. నా కొడుకు ఎందుకు ఓడిపోయాడో అర్థం కావడంలేదని అన్నారు. ఈ క్రమంలోనే ఆయన ఉద్వేగానికి లోనయ్యారు. కన్నీటిని ఆపుకోలేకపోయారు. అలాగే తనకు రాజకీయాలు అవసరం లేదని.. ప్రజల ప్రేమని మాత్రమే కోరుకుంటున్నట్టు తెలిపారు. కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం సుస్థిరంగా ఉండాలంటే ఈ ఉప ఎన్నికల్లో కనీసం 8 స్థానాలు గెల్చుకోవాలి. డిసెంబర్ 9వ తేదీన ఉప ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. కాగా, సార్వత్రిక ఎన్నికల్లో మండ్యా లోక్సభస్థానం నుంచి పోటీచేసిన కుమారస్వామి తనయుడు నిఖిల్.. సినీ నటి సుమలత చేతిలో ఓడిపోయిన సంగతి తెలిసిందే. గతంలో కూడా పలుమార్లు కుమారస్వామి ప్రజలతో మాట్లాడుతూ కన్నీటి పర్యంతం అయిన సంగతి తెలిసిందే.

## ఘనంగా గౌరీ పరమేశ్వరుల అనుపుమహోత్సవం



సింహాచలం: 72 వ వార్డ్ సింహాచలం గాంధీ నగర్ లో ఏర్పాటుచేసిన గౌరీ పరమేశ్వరుల అనుపు మహోత్సవం అశేష మహిళా భక్తులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు కార్తీక మాసం నెల రోజుల పాటు పూజలు అందుకున్న గౌరీ పరమేశ్వరులకు మార్గశిరపాడ్యమితో ఉత్సవం ముగిసింది అనుపు పురస్కరించుకుని భారీ అన్నదానం ఏర్పాటుచేయ గా కాంగో డాన్సు లు కాళీ వేసాలు డప్పులు వాయిద్యాల నడుమ ఘనంగా ముగిసింది ఈ సందర్భంగా అమ్మవారికి మహిళా భక్తులు పసుపు కుంకుమలతో ఫల పుష్పాలతో పూజలు చేశారు.

## ముగిసిన జర్నలిస్టుల ఇండోర్ గేమ్స్

### నేటి నుంచి క్రికెట్ పోటీలు ప్రారంభం

### 13 జట్లు మధ్య హెూరాహెూరీ

### ట్రోఫీలను అవిష్కరించిన సిఎంఆర్ అధినేత మాపూరి



విశాఖపట్నం : వైజాగ్ జర్నలిస్టుల ఫోరం, సిఎంఆర్ ఇంటర్ మీడియా స్పోర్ట్స్ మీట్లో బాగంగా గురువారం తో ఇండోర్ గేమ్స్ ముగిశాయి. ఇందులో పలువురు జర్నలిస్టులు ఉత్సాహంగా పాల్గొని విజేతలుగా నిలిచారు. అథ్లెటిక్స్తో పాటు షటిల్ , క్యారమ్స్, చెస్, టెన్నికాయిట్ పోటీలు నిర్వహించారు. ఇక గురువారం నుంచి క్రికెట్ పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇందుకు సంబందించిన ట్రోపీలను సిఎంఆర్ అధినేత మాపూరి వెంకటరమణ చేతుల మీదుగా అవిష్కరించారు. ఈ సందర్భంగా మాపూరి మాట్లాడుతూ గత 15 ఏళ్ళుకు పైగా జర్నలిస్టుల క్రీడలకు తమ వంతు సహకారం అందిస్తున్నామన్నారు.

విశాఖ నగరం అన్ని రంగాల్లో అభివృద్ది చెందాలన్నదే తమ లక్ష్యం అన్నారు. వీజెఎఫ్ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఫోరం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, కార్యదర్శి ఎస్ దుర్గారావులు మాట్లాడతూ విస్జా సహకారంతో క్రికెట్ టోర్నీ కి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. గురువారం ఉదయం పోర్టు మైదానంలో తొలి మ్యాచ్ సాక్షి, ప్రజాశక్తి జట్ల మధ్య జరగనున్నది. ఈ పోటీలకు ముఖ్య అతిధులుగా విశాఖ పోర్టు చైర్మన్, కె రామమోహన్రావు, నగర పోలీస్ కమిషనర్ ఆర్ కె మీనా, హెచ్పిసిఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రతన్రాజ్, తదితర్లు హాజరై మ్యాచ్ ను ప్రారంభించనున్నారు. 13 జట్ల ఈ టోర్నీలో పాల్గొంటాయని, ఫైనల్స్ డిసెంబర్ మూడో తేదిన పోర్టు మైదానంలో జరగుతాయని అదే రోజు ముగింపు వేడుకలను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఆర్ నాగరాజ్ పట్నాయక్, టి నానాజీ, కోశాధికారి పిఎన్ మూర్తి, జాయింట్ సెక్రటరీ దాడి రవికుమార్, కార్యవర్గ సభ్యులు ఇరోతి ఈశ్వరావు, గిరిబాబు, వరలక్ష్మి, ఎమ్మెస్సార్ ప్రసాద్, గయాజ్, దివాకర్, మాధవరావు,డేవిడ్,శేఖర్ మంత్రి తదితర్లు పాల్గోన్నారు.

## గొర్లివానిపాలెంగ్రామ టిడిపి అద్యక్షుడుగా బైలపూడి రాజు



పరవాడ: పరవాడ మండలము గొర్లివాని పాలెం గ్రామ కమిటిఅద్యక్షుడుగా బైలపూడి రాజు, ఉపాద్యాక్షుడు గా రొంగలి నాయుడు, ప్రదాన కార్యదర్శిగా గొర్లి సోమునాయుడు ను ఎన్నుకున్నారు.తెలుగు యువత అద్యక్షుడుగా నరవ.సోమునాయుడు,ఉపాద్యక్షుడుగా పైల సత్యనారాయణ,ప్రదానకార్యదర్శిగా గొర్లి శ్రీనువాస్ ,తెలుగు మహిళ అద్యక్షులు అడిగర్ల అమ్మాజీ,ఉపాద్యక్షులుగా పూడి భవాని, ప్రదానకార్యదర్శి నరవ.అపరంజినీ, తెలుగు రైతు నరవ కనకారాజు,ఉపాద్యక్షుడు టి. సత్యనారాయణ,ప్రదాన కార్యదర్శిగా నరవ శ్రీనుని ఎన్నుకున్నారు. అనంతరము ఎన్నికైన వారు మాట్లడుతూ గ్రామంలో టిడిపి అభివృద్ధికై తమ వంతు సహకారాన్ని అందిస్తామనీ తెలిపారు.ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ గొర్లి కనకారావు, తాజా మాజీ ఎంపిటిసి సభ్యులు గొర్లి శ్రీనువాస్ రావు, మండలపార్టి ప్రెసిడెంట్ బొండా సన్నిదేముడు,ఇందల కొండలరావు తధితర్లు పోల్గోన్నారు.

## భాగ్యరాజాపై కఠిన చర్యలు తీసుకోండి

అమరావతి: ప్రముఖ తమిళ దర్శకుడు, నటుడు భాగ్యరాజాపై తమిళనాట పెద్ద దుమారం రేగుతోంది. తెలుగు ప్రేక్షకులకు కూడా చిరపరిచితుడైన భాగ్యరాజా మహిళలపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై మహిళా సంఘాలు భగ్గుమంటున్నాయి. ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్మన్ వాసిరెడ్డి పద్మ కూడా భాగ్యరాజా వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన భాగ్యరాజాపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ తమిళనాడు మహిళా కమిషన్కు ఆమె లేఖ రాశారు. రేప్ ఘటనల్లో మహిళలను తప్పుబట్టేలా మాట్లాడటం ఎంతమాత్రం మానవత్వం కాదని, చిన్నపిల్లలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు వీరికి కనిపించడం లేదా? అని ఆమె నిలదీశారు. ప్రభుత్వాలు, మహిళా సంస్థలు, పోలీసులు, న్యాయ వ్యవస్థ మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను ఆపేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తుంటే కొందరు సెలబ్రిటీలు మాత్రం మహిళలను కించపరచడం, దారుణాలకు మద్దతు నిచ్చారు.

## వాల్తేరు డివిజన్ కొరకు కేంద్రంపై

# ఒత్తిడి తెస్తున్న విశాఖ ఎంపీ ఎంవీవీ

**విశాఖ కేంద్రంగా, వాల్తేరు డివిజన్‌తో కూడిన దక్షిణ కోస్తా రైల్వే జోన్‌ను ప్రకటించాలి**

**రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి బాటలోనే విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ**

**ఇదే విషయంపై కసరత్తు ప్రారంభించాలని కేంద్ర రైల్వే సహాయమంత్రి సురేష్ చినబసప్ప సంగడికి విజ్ఞప్తి**



న్యూఢిల్లీ : దశాబ్దాల కాలంనాటి విశాఖ కేంద్రంగా ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ పడినప్పటికీ, వాలేరును దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లో కొనసాగించాలన్న ప్రముఖ డిమాండ్ ప్రస్తుతం ఉంది. ఇదే విషయం పై తాజాగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి రైల్వే బోర్డు చైర్మన్ ను కలిసిన విషయం తెలిసిందే. అదే బాటలో విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పయనిస్తున్నారు. వాల్తేరు డివిజనను రాయగడ డివిజన్ లో కలపకుండా, విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ విలీనం చేసి త్వరిగ గతిన ప్రకటన చేయాలని విశాఖ లోక్ సభ సభ్యులు ఎంపీవీ సత్యనారాయణ కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి చినబసప్ప సంగడిని కోరారు.న్యూఢిల్లీ లో మంత్రి కార్యాలయంలో ఎంవీవీ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయసాయిరెడ్డి వ్యాఖ్యలకు ఊతమిస్తూ , అధిక ఆదాయాన్ని సముపార్జించే వాల్తేరు డివిజన్‌ను దక్షిణ కోస్తా రైల్వే జోన్ విలీనంపై తగు అనుకూల నిర్ణయం తీసుకోవాలని మంత్రిని అభ్యర్థించామన్నారు. ఇదే విషయంపై వినతిపత్రాన్ని అందజేసి, సంబంధిత విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు. తదుపరి మంత్రి తమ విన్నపానికి సానుకూలంగా స్పందించారని ఎంపీ తెలియజేసారు.

# భక్తుల కల్పవృక్షం శ్రీ కనకమహాలక్ష్మీ అమ్మవారి మార్గశిర మాసోత్సవములు ప్రారంభం



విశాఖ సిటీ : స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ వికారి నామ సంవత్సర మార్గశిర పాడ్యమి బుధవారం అనగా 27 నుండి మార్గశిర అమావాస్య లక్ష్మీ వారం 26 వరకు భక్తుల కల్పవృక్షమై వెలసియున్న శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవములు జరుగునని కార్యనిర్వాహణాధికారి ఎన్.వి.ఎస్.ఎన్. మూర్తి పేర్కొన్నారు ఇందులో భాగంగా స్థానిక శాసన సభ్యుడు వాసుపల్లి గణేశ్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి మార్గశిరమాసోత్సవములు ప్రారంభించారు. వేదపారాయణ, సప్తశతీపారాయణ, లక్ష్మీ హోమం ప్రతీ రోజూ నిర్వహించబడునని తెలిపారు. త్రికాలార్చన సురియు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమములు నిర్వహించబడును. అధిక సంఖ్యలో భక్తులు శ్రీ అమ్మవార్ని దర్శించుకున్నారు.

**19న అనదానం:**

ప్రతి రోజు నిర్వహించు అన్నప్రసాద వితరణలో 3,000 మంది భక్తులకు నిర్వహించుట జరిగినదని తెలిపారు.

**సాంస్కృతిక కార్యక్రమం:**

మార్గశిరమాసం నెల రోజులు అనగా 27 నుండి 26-12-2019 వరకు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమములు ఏర్పాటు చేయబడినవని తెలిపారు. అందులో బాగంగా బుధవారం వి.వనజచే అన్న మాచార్య కీర్తనలు భక్తులను ఎంతగానో అలరించినది. సాంస్కృతిక కార్యక్రమ ములో భాగంగా నేడు కె. మంజుశ్రీచే కూచిపూడి నృత్యం ఏర్పాటు చేయడమైనదన్నారు.

ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారి ఎన్.వి.ఎస్.ఎన్. మూర్తి, సహాయ కార్యనిర్వాహణాధికా రులు వి. రాంబాబు, వి.బి.వి. రమణ మూర్తి, ఉపకార్యనిర్వాహక ఇంజనీరులు సిహెచ్.వి. రమణ, బి. రాంబాబు, సహాయ ఇంజ నీరులు కె.ఎస్.ఎన్. మూర్తి, డి.వి.ఎస్.ఆర్. గాజు పర్యవేక్షకులు పి శ్రీనివాస్, ఏ త్రిమూర్తులు, ఎన్.వి.వి.ఎస్.ఎస్.ఏ.ఎన్. రాజు, మరియు. గాయత్రి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# క్రీడల్లో రాణిస్తేనే జాతీయ స్థాయి గుర్తింపు



ఆంధ్ర విశ్వకళాపరిషత్ : క్రీడల్లో రాణిస్తేనే జాతీయ స్థాయి గుర్తింపు లభిస్తుందని ఆంధ్రా యూని వర్సిటీలోని దూరవిద్యా విభాగం సంచాలకులు ఆచార్య పూజారి హరిప్రకాష్ తెలిపారు. ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో ఇటీవల నిర్వహించిన అంతర కళాశాలల క్రీడా పోటీల్లో బాక్సింగ్ ( హెవీవెయిట్ ) లో అద్భుత ప్రతిభ కనబరిచిన బిఎస్సీ తృతీయ సంవత్సరం విద్యార్థి సింగూరు హేమంత రాజును ఆచార్య హరిప్రకాష్ బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. హేమంతరాజు నగరంలోని ప్రిజమ్ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం బిఎస్సీ చదువుతున్నాడు. హెవీవెయిట్ బాక్సింగ్ లో బంగారు పతకం సాధించాడు. అంతేకాదు 2017,2018, 2019 సంవత్సరాల్లో వరుసగా మూడేళ్లు బాక్సింగ్‌లో బంగారు పతకాలు సాధించిన హేమంతరాజుకు అద్భుత భవిష్యత్ ఉంటుందన్నారు. ఇటీవల కాలంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి విభిన్న పథకాలతో క్రీడాకారులను ఎంతో ప్రోత్సహిస్తున్నట్టు గుర్తుచేశారు. చదవుతో పాటు క్రీడల్లో కూడా ప్రవేశం ఉంటేనే విద్యార్థులు అద్భుత విజయాలు సొంతం చేసుకోవచ్చన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు ఒత్తిడిని కూడా దూరం చేస్తాయని చెప్పారు. క్రీడల్లో అద్భుత ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలతోపాటు ఉద్యోగావకాశాలు కూడా విస్తృతం గా ఉన్నట్టు పేర్కొన్నారు. బంగారు పతకం గెలిచిన విద్యార్థి హేమంత రాజు తండ్రి సింగూరు విశ్వనాథం కస్టమ్స్ డిపార్టుమెంట్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సంజీవిని కళాశాలల కరస్పాండెంట్ సిహెచ్.ప్రవీణ్‌కుమార్, డాక్టర్ ఎం.సుదర్శనరావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి భక్తులకు 10 రోజులపాటు వైకుంఠ ద్వార దర్శనం



తిరుపతి : శ్రీవారి భక్తులకు టీటీడీ తీపి కబురు అందించింది. వైకుంఠ ద్వారాలను 10 రోజుల పాటు తెరిచి ఉంచాలని తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) భావిస్తోంది. అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ఇప్పటికే సిద్ధం చేసింది. ప్రస్తుతం తిరుమలకు వచ్చే భక్తులను ఏకాదశి, ద్వాదశి పర్వదినాల్లో మాత్రమే వైకుంఠ ద్వారం గుండా అనుమతిస్తున్నారు. ఈ నేపథ్యంలో భక్తులు రద్దీని దృష్టిలో ఉంచుకొని 10 రోజుల పాటు వైకుంఠ ద్వార మహోత్సవం పేరుతో ద్వారాలను తెరవాలని టీటీడీ భావిస్తోంది. ఈ సందర్భంగా పది రోజుల పాటు వైకుంఠ ద్వారం గుండా భక్తులను అనుమతించేందుకు ఆగమ సలహా మండలి అంగీకరించింది. ఒకవేళ పాలకమండలి ఆమోదం పొందితే ఈ ఏడాది నుంచే నూతన విధానం అమల్లోకి రానుంది.

# విశాఖ విమానాశ్రయానికి వై.యస్.ఆర్‌గా నామకరణం చేయాలి



న్యూఢిల్లీ : విశాఖపట్నం విమానాశ్రయానికి డాక్టర్ వై.యస్.రాజశేఖర రెడ్డి అంతర్జాతీయ విమానాశ్రయంగా పేరు పెట్టాలని విశాఖ పార్లమెంట్ సభ్యుడు ఎం.వీ.వీ.సత్యనారాయణను వై.ఎస్.ఆర్.సీ.పీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీలకర్ర నాగేంద్ర ఢిల్లీలో కలుసుకొని వినతిపత్రం అందజేశారు. 2004 నుండి 2009 వరకు వై.ఎస్.రాజశేఖర రెడ్డి కృషి వల్లే ప్రస్తుతం విశాఖ నగరం పారిశ్రామికంగా అభివృద్ధి చెందిందని, విశాఖపట్నం అభివృద్ధికి ఎంతో కృషి చేసిన నేత వై.ఎస్. రాజశేఖర రెడ్డి అని అన్నారు. దీనిపై ఎం.పీ ఎంవీవీ సత్యనారాయణ సానుకూలంగా స్పందించారని, ఈ విషయం విమానయాన శాఖ మంత్రి హారదీప్ సింగ్ మరియు విమానయాన అధికారుల దృష్టికి తీసుకువెళ్తానని ఎం.పీ ఎంవీవీ సత్యనారాయణ హామీ ఇచ్చారని నాగేంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆళ్ల శివ గణేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# సీపీఎస్ రద్దుపై వర్కింగ్ కమిటీ

అమరావతి : కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (సీపీఎస్) రద్దు అంశంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వర్కింగ్ కమిటీని నియమించింది. చీఫ్ సెక్రటరీ నేతృత్వంలో ఐదు శాఖల కార్యదర్శులతో కమిటీ నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీ కన్వీనర్‌గా ఆర్థికశాఖ కార్యదర్శి, సభ్యులుగా ప్లానింగ్, పాఠశాల విద్య, పంచాయతీ రాజ్, వైద్య శాఖ కార్యదర్శులు ఉన్నారు. కమిటీ ఛైర్‌పర్సన్‌గా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్నిని నియమించింది. ఎస్పీ టక్కర్ కమిటీ ఇచ్చిన నివేదికను ఈ కమిటీ పరిశీలిస్తుంది. జూన్ 30లోపు నివేదిక అందజేయాలని వర్కింగ్ కమిటీని ప్రభుత్వం ఆదేశించింది.

## జమ్మూ కశ్మీర్, లద్ధాఖ్

# కేంద్రపాలిత ప్రాంతాల విలీనానికి లోక్‌సభ ఓకే



న్యూఢిల్లీ: ఆర్టికల్ 370 నిర్వీర్యంతో రాష్ట్రాల సంఖ్య 29 నుంచి 28కి తగ్గింది. అలాగే కేంద్ర పాలిత ప్రాంతాల సంఖ్య 7 నుంచి 9కి పెరిగింది. కారణం, అప్పటి వరకు రాష్ట్రంగా ఉన్న జమ్మూ కశ్మీర్‌ను రెండుగా (జమ్మూ కశ్మీర్, లద్ధాఖ్) విడదీసి.. రెండింటినీ కేంద్ర పాలిత ప్రాంతాలు చేశారు. అయితే ఇప్పుడు ఈ కేంద్ర పాలిత ప్రాంతాల సంఖ్య తగ్గిపోనుంది. అవును.. ప్రస్తుతం 9గా ఉన్న కేంద్ర పాలిత ప్రాంతాల సంఖ్య 8కి చేరనుంది. భారత పశ్చిమ తీరంలో ఉన్న రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు.. డయ్యూ డామన్, దాద్రా నగర్ హవేలిలను ఒకే కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చేయడానికి రూపొందించిన బిల్లును లోక్‌సభ ఈరోజు ఆమోదించింది. డయ్యూ డామన్, దాద్రా నగర్ హవేలి బిల్లు 2019ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి లోక్‌సభలో ప్రవేశపెట్టారు. కాగా, దీనికి సభలో మెజారిటీ సభ్యులు మద్దతు తెలిపారు. అయితే, కొత్తగా ఏర్పాటు కాబోయే కేంద్రపాలిత ప్రాంతానికి 'దాద్రానగర్ హవేలీ అండ్ డామన్ డయ్యూ'గా నామకరణం చేయనున్నారు.

# జనవరి 1 నాటికి అన్ని గ్రామ సచివాలయాలు ప్రారంభించాలి

- సచివాలయ భవనాల నిర్మాణానికి నియోజక వర్గానికి 13 కోట్ల రూపాయలు
- అంగన్‌వాడీ భవనాలు ఫిబ్రవరి 28 నాటికి పూర్తి చేయాలి
- కలెక్టర్ వినయ్ చంద్ అధికారులకు ఆదేశం



విశాఖపట్నంః జనవరి 1 నాటికి అన్ని గ్రామ సచివాలయాలు ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్ అదికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధి హామీ కన్వర్జన్సీ నిధులపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 గ్రామీణ శాసన సభ నియోజక వర్గాల్లో అవసరమైన చోట కొత్త భవనాల నిర్మాణానికి వెంటనే పరిపాలనా ఆమోదం పొందాలని, ప్రతి నియోజక వర్గంలోను భవనాల ఆవశ్యకతపై ప్రజా ప్రతినిధులతో చర్చించాలన్నారు. ఉపాధి హామీ మెటీరియల్ కాంపొనెంట్ నిధుల లభ్యత మేరకు పూర్తిగా భవనాలు లేనిచోట టైప్ 1 భవనాలు, మిగిలిన చోట టైప్ 4 భవనాలు నిర్మాణాలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. అంగన్ వాడీ భవనాలు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 2019-20 ఆర్థిక సంవత్సరంలో 200 కోట్లకు పైగా ఉపాధి హామి మెటీరియల్ కాంపొనెంట్ నిధులు అందుబాటులో ఉంటాయని, ఆ నిధులు ముందుగా గ్రామ సచివాలయ భవనాల నిర్మాణానికి వినియోగించుకోవాలన్నారు. 140 భవనాలకు ఇప్పటికి అనుమతి ఇవ్వడమైనదని, దీనికి 49 కోట్ల రూపాయలు కేటాయించడమైనదని, తక్షణమే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఒక్కొక్క శాసన సభ నియోజక వర్గానికి 15 కోట్ల రూపాయలు కేటాయించినట్లు పేర్కొన్నారు. 13 కోట్లు గ్రామ సచివాలయ భవనాలకు, 2 కోట్లు సి.సి. డ్రైనేజ్ వ్యవస్థకు వినియోగించుకోవాలన్నారు. ఎస్.బి.ఎం. నిధులు సిసి డ్రైనేజ్ కు అనుసంధానం చేయనున్నట్లు ఆయన వివరించారు. ఏజన్సీ లో వంద సచివాలయ భవనాలు నిర్మించాలన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న 560 అంగన్ వాడీ భవనాలను ఫిబ్రవరి 28 లోగా పూర్తి చేయాలని ఆదేశాంచారు. డ్వామా పిడి సందీప్, హౌసింగ్ పి.డి. జయరామాచారి, డిఆర్డిఎ పిడి వి.విశ్వేశ్వర రావు, పంచాయితీరాజ్ ఎస్.ఇ. సుధాకర్ రెడ్డి, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఇ రవి కుమార్, డిఎఫ్ ఓ జ్యోతి, ఐసిడిఎస్ పిడి సీతామహాలక్ష్మి, పాల్గొన్నారు.

# అమిత్ షాతో టీడీపీ ఎంపీల భేటీ..

## వైసీపీపై ఫిర్యాదు



ఢిల్లీ: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో టీడీపీ ఎంపీల భేటీ అయ్యారు. ఇండియా మ్యాప్‌లో అమరావతిని చేర్చినందుకు అమిత్‌షాకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఏపీలో రౌడీ రాజ్యం సాగుతోందని ఫిర్యాదు చేశారు. టీడీపీ కార్యకర్తలపై వందల సంఖ్యలో దాడులు జరిగాయని... అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లారు. అన్ని తనకు తెలుసు అని అమిత్‌షా బదులిచ్చారు. మరిన్ని వివరాలతో మళ్లీ కలుస్తామని టీడీపీ ఎంపీలు వెల్లడించారు. భేటీలో గల్లా జయదేవ్, రామ్మోహన్ నాయుడు, కనకమేడల రవీంద్రకుమార్, సీతారామలక్ష్మి పాల్గొన్నారు.

# వాహన మిత్ర రెండో విడత షురూ!

## రవాణా శాఖ మంత్రి పేర్ని నాని



అమరావతి : వైఎస్సార్ వాహన మిత్ర పథకం రెండో విడత కింద లబ్దిదారులను ఖరారు చేశామని రవాణా శాఖ మంత్రి పేర్ని నాని బుధవారం వెల్లడించారు. రెండో విడతలో మొత్తం 65,054 దరఖాస్తులు రాగా, అందులో 62,630 దరఖాస్తులను లబ్దిదారులుగా గుర్తించామని వివరించారు. ఇప్పటివరకు మొత్తం 2 లక్షల 36 వేల 340 మందికి రెండు విడతల్లో ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. ఇందుకోసం 230 కోట్ల రూపాయలు విడుదల చేశామని పేర్కొన్నారు. అంతేకాకుండా వచ్చే ఏడాది కొత్త లబ్దిదారులు ఎంతమంది వస్తే అంతమందికి ఈ పథకం వర్తింపజేస్తామని ప్రకటించారు.

## ముత్తయ్య మురళీధరన్‌కు గవర్నర్ పోస్ట్..

కొలంబో: శ్రీలంక మాజీ బౌలర్ ముత్తయ్య మురళీధరన్ ఆ దేశ ప్రభుత్వంలో కీలక బాధ్యతలు చేపట్టనున్నారు. శ్రీలంక ఉత్తర ప్రావిన్స్ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టాలంటూ మురళీధరన్‌ను ఆ దేశ నూతన అధ్యక్షుడు గొటబాయ రాజపక్స ఆహ్వానించారని తెలుస్తోంది. మురళీధరన్‌తో పాటు మరో ఇద్దరు గవర్నర్ బాధ్యతలు అందుకోనున్నారని అక్కడి అధికార వర్గాలు తెలిపాయి.



Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ★ Phone : 2564353, Fax : 0891-2569004 ★ e-mail: vijayabhanudaily@gmail.com